
ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	44,271	44,271
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.13 (4.02)	5,215	4,000
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.981 (44.1813)	28,159	17,000

చికెన్ ధరలు | లైవ్: రూ.125 | డ్రెస్: రూ.190 | స్కిన్‌లెస్: రూ.220





వానాకాలంలోనూ విద్యుత్ డిమాండ్

వానాకాలంలోనూ జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. గృహ అవసరాలకు, పరిశ్రమలకు, వాణిజ్య అవసరాలకు, పండ్లతోటలకు వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటే, వానాకాలంలో వ్యవసాయ కనెక్షన్లకు ఎక్కువ ఉంటుంది. అందుకు భిన్నంగా ఈ సీజన్‌లో విద్యుత్ వినియోగం భారీగా నమోదవుతోంది. గత ఏడాది ఇదే సమయంలో వినియోగించిన విద్యుత్ కంటే ఈ సీజన్‌లో సగటున రోజుకు 2మిలియన్ యూనిట్లు అదనంగా నమోదవడం ఒక రికార్డు. గత ఏడాది ఇదే సీజన్ కంటే ప్రస్తుతం సగటున ప్రతిరోజూ రూ.50లక్షల విలువైన విద్యుత్ వినియోగం అవుతున్నట్టు అధికారులు అంచనావేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- వ్యవసాయ వినియోగం పెరగడమూ కారణం
- గృహవిద్యుత్‌కూ గతం కంటే ఎక్కువే
- సగటున 2మి.యూ అదనపు డిమాండ్

జిల్లాలో గత ఏడాది ఇదే సీజన్‌తో పోలిస్తే, వానాకాలంలోనూ గృహ వినియోగదారుల విద్యుత్ వినియోగ డిమాండ్ ఏమాత్రం తగ్గకపోగా పెరిగింది. సాధారణంగా జూలై నెల నుంచి ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం తగ్గుతుంది. గీజర్లు, వాటర్ హీటర్ల వినియోగం కొంతమేర ఉంటుంది. కాగా, అందుకు భిన్నంగా వాటర్ హీటర్లు, గీజర్ల వినియోగం పెరగడమేగాక, ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం ఏమాత్రం తగ్గలేదు. జిల్లాలో గత ఏడాది ఈ సీజన్ కంటే ఈ ఏడాది సగటున రోజుకు కనీసం మూడు లక్షల యూనిట్ల వరకు అదనపు వినియోగం పెరిగినట్లు విద్యుత్ అధికారులు అంచనావేస్తున్నారు. ఏటా పట్టణీకరణ పెరగడంతో పాటు, వేసవి కంటే వానాకాలం సీజన్ ఆరంభం నాటికి స్కూళ్లు, కాలేజీలు తెరుచుకోవడం వంటి కారణాలతో గృహవినియోగ విద్యుత్

- మిగతా 8వ పేజీలో...

నాలుగు రోజులుగా విద్యుత్ వినియోగం ఇలా..

తేదీ	ఈ ఏడాది (మి.యూ)	గత ఏడాది	పెరుగుదల
జూలై 31	18.07	16.08	1.99
ఆగస్టు 1	18.75	16.09	2.66
ఆగస్టు 2	12.00	17.26	-5.26
ఆగస్టు 3	18.78	17.60	1.18

వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగింది

గత ఏడాది కంటే ఈ సీజన్‌లో వ్యవసాయ విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. వర్షాలు తక్కువగా ఉండడం, ఆయకట్టులోనూ కాల్వలకు నీరివ్వకపోవడం వంటికారణాలతో రైతులు బోరుబావుల కింద సాగు చేపట్టారు. అందుకే గత సీజన్ కంటే భారీగా విద్యుత్ వినియోగం పెరిగిందని అంచనా వేస్తున్నాం. ఈ సీజన్‌లో అదనపు కనెక్షన్లే దాదాపు మూడువేలకు పైగా ఉన్నాయి. అదేవిధంగా గృహవినియోగం విద్యుత్ కూడా పెరిగింది. ఎంత వినియోగం పెరిగినా ప్రభుత్వం నిరంతర సరఫరాకు అవసరమైన విద్యుత్‌ను అందిస్తోంది. వినియోగదారులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వెంకటేశ్వర్లు, ఎస్ఈ

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు అలంకరించే పవిత్ర మాలలను చూపుతున్న ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో రెండో రోజు మంగళవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఉదయం ఆగమ శాస్త్రరీతిలో నవకలశ స్నపన తిరుమంజనం, ద్వారతోరణ పూజ, కుంభారాధన, చక్రాబ్జ మండలారాధన, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పంచసూక్తాలతో 108 నూలు పోగులకు అభిషేకం చేసి మాలలను తీర్చిదిద్దారు. సాయంత్రం విశేష హోమాలు, స్వర్ణమయ దివ్య విమాన సుదర్శ చక్రారాధన, అభిషేకాలు కొనసాగాయి.

7

● ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట



'పుట్టపాక' చేనేత కళాకారులకు పురస్కారాలు

- ముగ్గురికి కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు

6

దొడ్డు బియ్యం వేలం

- సన్న బియ్యం పంపిణీతో గోదాముల్లో మిగిలిన దొడ్డు బియ్యం
- నాలుగు నెలలుగా గోదాములు, రేషన్ డీలర్ల వద్దే..
- క్షేత్రస్థాయి నుంచి సమాచారం సేకరిస్తున్న అధికారులు



రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. అయితే అంతకుముందు పంపిణీకి సిద్ధంగా ఉంచిన, రేషన్ దుకాణాల్లో మిగిలిన దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలని నిర్ణయించింది. దీంతో బియ్యం నిల్వలపై సమాచారాన్ని సేకరిస్తోంది. అంతేగాక జిల్లాలోని నిల్వలను ఎక్కడికి చేరుస్తారనే విషయంపై వారం రోజుల్లో స్పష్టత రానుంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

దొడ్డు బియ్యం గోదాములు, రేషన్‌దుకాణాలకు చేరి నాలుగు నెలలు అవుతోంది. ఎక్కువ సమయం అలాగే ఉంచితే బియ్యానికి పురుగుపట్టే అవకాశం ఉంది. దీంతో ఆలస్యం చేస్తే బియ్యం దేనికీ ఉపయోగపడవని, వాటిని వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

గోదాములు, రేషన్‌దుకాణాల పరిశీలన

సాధారణంగా రైస్ మిల్లుల నుంచి తొలుత స్టేజ్-1 గోదాములకు, ఆ తర్వాత స్టేజ్-2 గోదాములకు, అక్కడి నుంచి రేషన్‌దుకాణాలకు బియ్యం సరఫరా అవుతుంది. గోదాముల్లో ఎంత మేరకు నిల్వలు ఉన్నాయనేది కాగితాల్లో నమోదు చేసినా వాస్తవంగా దుకాణాల్లో ఉన్నాయా? లేదా? అనేది అధికారులు పరిశీలిస్తున్నారు. వేలం వేయాలంటే నిల్వలే ముఖ్యం. దీంతో ఏ మేరకు దొడ్డు బియ్యం అందుబాటులో ఉందో రెవెన్యూ, సివిల్‌సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించి పరిశీలిస్తున్నారు. గోదాములను తనిఖీలు చేసి స్టేజ్-1, స్టేజ్-2 నిల్వలపై ఆరా తీస్తున్నారు. ఎఫ్‌సీఐ నుంచి స్టేజ్-1 గోదాముకు వచ్చిన నిల్వలు, దుకాణాలకు సరఫరా చేయగా స్టేజ్-2 గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యం వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, అప్పటికే గోదాములు, దుకాణాలకు ఆ నెల కోటా దొడ్డు బియ్యం సరఫరా అయింది. మూడు నెలల కోటాను ముందుగానే జూన్‌లో పంపిణీ చేయగా, సెప్టెంబరు వరకు రేషన్‌దుకాణాలు మూసే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దొడ్డు బియ్యం నిల్వలపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఒక్క యాదాద్రి జిల్లాలో 12వేల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి.

వారబందీ విధానంలో నీరు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వారబందీ విధానంలో సాగునీటిని విడుదల చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఏఎమ్మార్పీ కాల్వలకు సాగునీరందించే నాలుగు మోటర్లల్లో ఒకటి మరమ్మతుకు గురైందని, మూడో మోటార్ ట్రిప్ కావడంతో పూర్తిస్థాయిలో నీరు రావడం లేదన్నారు. ఉదయ సముద్రం నుంచి 100 క్యూసెక్కుల నీరు తక్కువగా వస్తోందన్నారు. అయితే మోటారు మరమ్మతుకు ఒక రోజు సమయం పట్టే అవకాశం ఉన్నందున సాగు నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉదయ సముద్రం నుంచి 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, అదనంగా మరో రోజు ఇలాగే కొనసాగించాలన్నారు. ప్రస్తుతం ఆయకట్టుకు మాత్రమే సాగునీటిని అందిస్తామని, ప్రస్తుత పరిస్థితుల్లో చెరువులకు నీటిని ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. నిర్దేశించిన నాలుగు నెలల సమయం వరకు ఎట్టి పరిస్థితుల్లో చెరువులను నింపేది లేదని తెలిపారు. నాలుగు మోటర్లు పూర్తిస్థాయిలో పనిచేసి, అనుకున్న మేర సాగునీరు వస్తే చెరువులను నింపుతామని స్పష్టంచేశారు. నాలుగో మోటారు బుధవారం నుంచి పనిచేస్తుందన్నారు. నాలుగు మోటార్లు పూర్తిస్థాయిలో పనిచేసిన తర్వాత నిర్దేశించిన ప్రకారం ఆయా డిస్ట్రిబ్యూటరీల ద్వారా నిరంతరం సాగు నీటిని ఎలాంటి అవరోధం లేకుండా ప్రణాళిక ప్రకారం విడుదల చేయాల ని సూచించారు. కాగా ఏఎమ్మార్పీ నుంచి సాగు నీటి విడుదలకు షెడ్యూల్ రూపొందించామన్నారు. నవంబరు 24వ తేదీ వరకు కాల్వల ద్వారా సాగునీటిని ఇచ్చేలా షెడ్యూల్ రూపొందించినట్టు ఇరిగేషన్ అధికారులు వివరించారు. సమావేశంలో ఈఈ నెహ్రూనాయక్, ప్రభుకళ్యాణ్, డీఈఈ ఆంజనేయస్వామి, పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు

(ఆంధ్రజ్యోతి, మర్రిగూడ): వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని 30పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. అంతకుముందు ప్రభుత్వ ఆస్పత్రిలోని కిడ్నీ వార్డును తనిఖీచేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌రే ప్లాంట్, మందుల వివరాలు అడిగి రికార్డులను పరిశీలించారు. వైద్యుల తీరుపై అసహనం వ్యక్తం చేసి, సమయ పాలన పాటించాలని, తీరు మార్చుకోవాలని సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను తనిఖీచేశారు. ఆమె వెంట డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాతృనాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌నాయక్, డాక్టర్ కోటినాయక్, డాక్టర్ దీపక్, డాక్టర్ శాలిని, పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేసీఆర్, హరీ‌ష్‌పై కాంగ్రెస్ కుట్రలు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

నల్లగొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏదో ఒక కారణంతో కేసీఆర్, హరీ‌ష్‌రావును జైలుకు పంపాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీ‌ష్‌రావు మంగళవారం హైదరాబాద్ నుంచి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వీక్షించారు. అనంతరం ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, రాష్ట్ర నేత కంచర్ల కృష్ణారెడ్డితో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరంపై హరీ‌ష్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ స్పష్టంగా కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టిందన్నారు. కేసీఆర్, హరీ‌ష్‌రావుపై కుట్రలు చేస్తూ జైలుకు పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కయి సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రకరకాల కమిషన్లు వేసినా ఏదీ తేల్చలేకపోయారని, కాళేశ్వరంపై మరో కమిషన్ వేశారని విమర్శించారు. అన్ని అనుమతులతో గోదావరిపై మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం చేశారన్నారు. తక్కువ ఖర్చుతో కాళేశ్వరం పూర్తిచేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇచ్చారన్నారు. సూర్యాపేట వరకు సాగునీరు పారించారని, కానీ రేవంత్‌రెడ్డి రెండేళ్లలో చేసిందేమీలేదన్నారు. గత ప్రభుత్వ పథకాలపై కమిషన్లు, విచారణల పేరుతో ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరంపై ఇచ్చిన కమిషన్ నివేదిక ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. వీటిని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో జరిగే స్థానికసంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి, నాయకులు అభిమన్యు శ్రీనివాస్, రాంమోహన్, బక్క పిచ్చయ్య, పాల్గొన్నారు.

నేర నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



కార్డన్‌సెర్చ్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నకిరేకల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. మంగళవారం నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డు, ఎస్సీ కాలనీలో డీఎస్పీ శివరాంరెడ్డి, 20 మంది ఎస్‌ఐలు, 300 మంది పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 300 ఇళ్లలో సోదాలు నిర్వహించగా, సరైన పత్రాలులేని 130 వాహనాలను పట్టుకున్నామన్నారు. అందులో 120 ద్విచక్రవాహనాలు, 10 ఆటోలు, ఎనిమిది మంది అనుమానితులను గుర్తించామన్నారు. ఒకరిని నేరస్థుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. నేపాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను విచారిస్తున్నామన్నారు. ఒక షెడ్డులో అక్రమంగా ఉంచిన 15 ఆవు దూడలను పట్టుకుని, వాటిని గోశాలకు తరలిస్తున్నామన్నారు. అదే విధంగా 18 మంది గంజాయి వినియోగిస్తున్న అనుమానితులను అదుపులోకి తీసుకుని పరీక్షలకు పంపించామన్నారు. ఎక్కడైనా అనుమానితులు కన్పిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కొత్తగా అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రాఘవరావు, ఆదిరెడ్డి, కొండల్‌రెడ్డి, కరుణాకర్, మహాలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న యూఎస్‌పీఎస్ నాయకులు

నల్లగొండ(కలెక్టరేట్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు గడిచినా ప్రభుత్వ విద్యారంగ పరిస్థితి మెరుగు పడకపోవడం శోచనీయమన్నారు. కొత్తప్రభుత్వం ఏర్పడి 19 నెలలైనా దీర్ఘకాలంగా పరిష్కారంకాని సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. ఉద్యోగుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని అన్నారు. కొత్త కొత్త పేర్లతో నూతన పాఠశాలను ప్రారంభించడం,ఎక్కువ మంది చదివే విద్యార్థులు ఉన్న పాఠశాలకు తక్కువ నిధులు ఖర్చు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో చేపట్టే మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బక్క శ్రీనివాసచారి, కె.రత్నయ్య, బి.వెంకటేశం, జి.నాగమణి, పెరుమాళ్ల వెంకటేశం, పి.వెంకులు, ఖుర్షిద్‌మియా, నర్రా శేఖర్ రెడ్డి, వడిత్య రాజు, జి.అరుణ, యాట మధుసూదన్‌రెడ్డి, నలపరాజు వెంకన్న, మురలయ్య, పగిళ్ల సైదులు, కొమర్రాజు సైదులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లాటరీ ద్వారా ఎంపిక చేసిన డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ఏవో మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 2017లో కలెక్టరేట్ వెనుక 552 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, సీపీఎం ఆధ్వర్యంలో పలుమార్లు చేపట్టిన ఆందోళనలతో 2023లో నిరుపేదల నుంచి దరఖాస్తులు తీసుకున్నారన్నారు. మొత్తం 10వేల దరఖాస్తులు రాగా, 3వేల మందిని అధికారులు అర్హులుగా గుర్తించారన్నారు. అనంతరం లాటరీ ద్వారా 552 మంది లబ్ధిదారులను గుర్తించి రెండేళ్లయినా వారికి ప్రొసీడింగ్స్ ఇవ్వలేదన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయాన్ని కోట్ల రూపాయలతో ఆరు నెలల్లో పూర్తిచేసిన చిత్తశుద్ధి పేదల ఇళ్ల నిర్మాణంపై లేకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలైనా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం విచారకరమన్నారు. ఈ నెల 15 నాటికి ప్రొసీడింగ్స్ ఇవ్వకుంటే 16న లబ్ధిదారులతో కలిసి ఆక్రమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండి.సలీం, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, కోట్ల అశోక్‌రెడ్డి, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, అవుట రవీందర్, గంజి రాజేష్, కీసర ప్రశాంతి, సిరాజుద్దీన్, పగిళ్ల జయమ్మ, వెంకటమ్మ, గౌసియా, తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి అండగా యాదాద్రి కలెక్టర్

● ఉన్నత విద్యాభ్యాసానికి సహకరిస్తానని హామీ



యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావుతో విద్యార్థిని సాత్విక

మర్కుక్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆమె ఐదో తరగతిలో ఉండగా ఆయన అక్కడ ప్రత్యేకాధికారి. అప్పట్లో బాలికలోని ప్రతిభను గుర్తించిన ఆయన తాను ఎక్కడ ఉన్నా ఉన్నత విద్యాభ్యాసానికి అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఇప్పుడాయన యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్. ఆ బాలిక ఇప్పుడు ఇంటర్‌లో 992/1000 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఉన్నత చదువులు చదివే పరిస్థితి లేకపోవడంతో ఆర్థిక భరోసా కోసం అప్పుడు మాట ఇచ్చిన ఇప్పటి యాదాద్రిభువనగిరి కలెక్టర్ హనుమంతరావును కలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి కలెక్టర్ హనుమంతరావు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రత్యేక అధికారిగా ఉన్న సమయంలో మర్కుక్ మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల మూతపడే దశకు చేరుకుందని హనుమంతరావు తెలుసుకున్నారు. ఊరి వాళ్లతో మాట్లాడి పిల్లలు బడికి వచ్చేలా చేసి, ఆ బడిని నిలబెట్టారు. అప్పుడు ఆ గ్రామానికి చెందిన బిళ్ల స్వాతిక అనే ఐదో తరగతి విద్యార్థిని ప్రతిభ చూసి అభినందించడంతో పాటు ఆమెకు చదవు విషయంలో అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో బిళ్ల సాత్విక చదువులో ముందడుగు వేసింది. పదో తరగతిలో 10కి 10 జీపీఏ సాధించింది. ఇంటర్ ఎంపీసీలో 992/1000 మార్కులతో రాష్ట్రంలో మూడు స్థానంలో నిలిచింది. మంచి కాలేజీలో ఇంజనీరింగ్ కోర్సు చదివేందుకు సీటు సంపాదించింది. కానీ, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతే కావడం, ఎప్పుడో మాట ఇచ్చిన అధికారి హనుమంతరావు యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్‌గా ఉన్నారని తెలిసి మంగళవారం వెళ్లి కలిసింది. ఆయన విద్యార్థిని అభినందించడంతో పాటు ఆమె ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట గ్రామ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, ఉపాధ్యాయులు చిన్ని కృష, విద్యార్థిని తండ్రి శ్యాంసుందర్ ఉన్నారు.

జాతీయ రహదారిపై నిలిచిన లారీ

రాకపోకలకు అంతరాయం



తూప్రాన్‌పేట వద్ద హైదరాబాద్ వైపు నిలిచిన లారీ

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా తూప్రాన్‌పేట వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆకస్మాత్తుగా లారీ నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ తూప్రాన్‌పేట శివారు వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయరహదారిపై సోమవారం రాత్రి మరమ్మతులకు గురైంది. లారీ కదలని పరిస్థితిలో రోడ్డుపైనే డ్రైవర్ నిలిపాడు. దీంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలిగింది. గంటల తరబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం 12గంటల వరకు వాహనాలకు తీవ్ర అంతరాయం నెలకొంది. రాత్రి ట్రాఫిక్ పోలీసులు చేరుకున్నప్పటికీ లారీ కదలకపోవడంతో రాకపోకలను నియంత్రించలేకపోయారు. ట్రాఫిక్ పోలీసులు రెండు భారీ క్రేన్లను తీసుకువచ్చి పక్కకు జరిపించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



మాలె రాంరెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ తగాదాలతో ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్వాల గ్రామానికి చెందిన మాలె రాంరెడ్డి, అతడి భార్య గీత తమ వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చే విషయంలో పరస్పరం గొడవపడినట్లు తెలిపారు. గొడవ అనంతరం భార్య మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రాంరెడ్డి గది బయటి నుంచి గడియపెట్టి భార్యకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అనంతరం భార్య నిద్ర నుంచి లేచి భర్త గురించి వెతుకుతుండగా భర్త ద్విచక్రవాహనం పొలం వద్ద ఉందని తెలిసింది. వెళ్లి చూడగా అక్కడ ఆయన కనిపించలేదు. దీంతో అదృశ్యమైన రాంరెడ్డి గురించి అతడి భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి విషయమై ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712670199 నెంబర్‌కు సమాచారం అందిచాలన్నారు.

షూటింగ్‌లో వెన్నెలకు రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు

చిలుకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన షూటింగ్ పోటీల్లో సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి ఆర్టీసీ కండక్టర్ బెల్లంకొండ వీరయ్య కుమార్తె వెన్నెల రాష్ట్రస్థాయి మొదటిర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా వెన్నెలను బంధువులు, గ్రామస్థులు అభినందించారు.

అవార్డుల పుట్టపాక

● రాష్ట్ర ప్రభుత్వ కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డులకు ముగ్గురి ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రతీ ఏడాది కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరిట అవార్డులను ప్రదానం అందజేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాదికి యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక చేనేత కార్మికులు సామల భాస్కర్, గూడ పవన్, కొలును శంకర్‌లలు అవార్డులకు ఎంపికయ్యారు. చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వీరికి అవార్డుల ప్రదానం అందజేస్తుంది.

(ఆంధ్రజ్యోతి-సంస్థాన్‌నారాయణపురం)



తాను తయారు చేసిన చీరతో శంకర్

చేనేత రంగంలో పుట్టపాక గ్రామం తెలియని వారుండరు. ఇక్కడి కార్మికులు నేసిన పట్టువస్త్రాలకు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో ఎన్నో అవార్డులు వరించాయి. కేంద్రప్రభుత్వం ప్రకటించే ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డులను సైతం చేనేతరంగం నుంచి మొదటిసారి ఈ గ్రామానికి చెందిన కార్మికులకు దక్కడం విశేషం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే చేనేత జాతీయ పురస్కారాలకు ఈ గ్రామ చేనేతకార్మికులు లేకుండా అవార్డు జాబితా ఉండదంటే అతిశయోక్తి కాదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అందించే కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డులకు సైతం ఎంపికయ్యారు.

ప్రత్యేక రూపకల్పనతో

పుట్టపాకకు చెందిన కొలను శంకర్ సిల్క్, లెనిన్ కాటన్‌తో డబుల్ ఇక్కత్ పద్ధతిలో రాజ్‌కోట్ ప్రత్యేక చీరలను రూపొందించారు. ఇందులో కలర్ డిజైన్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. విభిన్న పద్ధతులతో తయారుచేసిన ఈ చీరను ప్రభుత్వం కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డుకు ఎంపిక చేసింది.

సాధారణ చీరలకు భిన్నంగా

మార్కెట్‌లో తయారయ్యే సాధారణ చీరల విక్రయాలు సరిగ్గా లేక చేనేత కార్మికుల జీవనోపాధి కష్టంగా మారింది. వీటిని దృష్టిలో పెట్టుకుని వినూత్నంగా చీరలను తయారు చేయాలని సామల భాస్కర్ ఆలోచించారు. అందులో భాగంగా నెమలి దేవత గల నమూనా చీరలను రూపొందించారు. ఈ చీర కొంగుకు 1000 మెట్లతో, మిగతా చీరకు 450 మెట్లతో వినూత్నంగా తయారుచేశారు. నిలువు సాధారణంగా, అడ్డం 3డీ మాదిరిగా నాలుగు అచ్చులతో ప్రత్యేకంగా రూపొందించారు. అంతేకాకుండా టస్సారు ఎల్లో, గ్రీన్, బ్రౌన్, రాయల్ బ్లూ, రెడ్ బ్లాక్‌లాంటి ఏడు రంగులను అద్ది ప్రత్యేకంగా చీరలు తయారు చేశారు.



చీరను ప్రదర్శిస్తున్న సామల భాస్కర్

ప్రకృతి రంగులతో అందమైన వస్త్రం

పుట్టపాక గ్రామానికి చెందిన గూడ పవన్ డబుల్ ఇక్కత్‌తో అందమైన చీరలను ఆవిష్కరించారు. బంతిపూలు, దానిమ్మ పండ్లు, వేర్లు వన మూలికలతో తయారు చేసిన సహజసిద్ధ రంగులను మల్బరి పట్టుదారానికి అద్ది జాతీయ, భౌగోళిక గుర్తింపు పొందిన తేలియా రుమాలుతో పట్టుచీరను తయారు చేశారు. 16 ఆకృతులు అద్ది మడతలు పడకుండా చీరను రూపొందించారు. ఈ చీర తయారు చేయడానికి పవన్ ఆరు నెలల పాటు శ్రమించారు. ఈ చీర ఖరీదు రూ.75 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎనిమిది సంవత్సరాలుగా చేనేతలో విభిన్న రకాలుగా శ్రమిస్తూ ఎన్నో నూతన నమూనాలను తయారు చేయడంతో పాటు తాజాగా ఈ వస్త్రాన్ని తయారు చేసి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. కాగా పవన్ ఇదే చీరను తయారు చేసినందుకు జాతీయ చేనేత అవార్డుకు ఎంపికయ్యారు.



తేలియా రూమల్ చీరను తయారు చేస్తున్న గూడ పవన్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మహిళలు మృతి



అర్థం కృష్ణవేణి (ఫైల్)

నార్కట్‌పల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొట్టడంతో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన అర్థం కృష్ణవేణి(58) పాల ప్యాకెట్ తేవడానికి ఇంటి నుంచి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో కామినేని వైపు నుంచి నార్కట్‌పల్లి వైపునకు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో కృష్ణవేణి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. ఆమేరకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే కృష్ణవేణి మృతి చెందింది. కృష్ణవేణి అల్లుడు బెలిదే నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు పట్టాలు దాటుతుండగా

వలిగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):రైల్వేపట్టాలు దాటుతున్న వృద్ధురాలిని రైలు ఢీకొట్టడంతో మంగళవారం అక్కడికక్కడే దుర్మరణం చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన గుళ్లని పోచమ్మ(92) మంగళవారం వలిగొండ మండలం ఎదుల్లాగూడెం గ్రామంలో తమ బంధువుల ఇంటికి రావడానికి స్టేజీ వద్ద బస్సు దిగింది. నడుచుకుంటూ వస్తోంది. సోమవారం కురిసిన వర్షానికి ఆ గ్రామ సమీపంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద భారీగా నీరు నిలిచింది. దీంతో పోచమ్మ నీటిలో నుంచి నడవలేని పరిస్థితిలో ప్రత్యామ్నాయంగా రైల్వే పట్టాల పైనుంచి నడుచుకుంటూ వెళ్తోంది. అప్పుడే అటుగా వెళ్తున్న రైలు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోచమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహం ఛిద్రమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాపాడిన ఎయిర్ బెలూన్‌లు

చౌటుప్పల్‌రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ఇద్దరు బయటపడగా, ఓ మహిళ మృతి చెందింది. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం చిర్రుకూరపాడు గ్రామానికి చెందిన మదిరాల గోవిందమ్మ(64) కుమారుడు ప్రవీణ్‌కుమార్, కోడలు సుమతితో కలిసి నూతనంగా కొనుగోలు చేసిన కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. బొర్రోళ్లగూడెం రాగానే రోడ్డుపై అజాగ్రత్తగా నిలిపిన లారీని అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో వెనుక సీట్‌లో కూర్చున్న గోవిందమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం మృతి చెందింది. సీట్‌బెల్టు ధరించడంతో బెలూన్ ఓపెన్‌కావడంతో కుమారుడు, కోడలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధ కుమార్ తెలిపారు.

వైద్యం వికటించడంతో మృతి చెందాడని ఆందోళన



ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న బాధిత బంధువులు, గ్రామస్థులు

మునగాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వైద్యం వికటించడంతోనే వ్యక్తి మృతి చెందాడని, ఆర్‌ఎంపీ వైద్యుడిని వెంటనే అరెస్టు చేయాలని సూర్యాపేట జిల్లా మునగాల పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం రాత్రి బాధితుడి బంధువులు, గ్రామస్థులు ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన గోవింద వెంకటేశ్వర్లు(35) జ్వరంతో బాధపడుతూ మంగళవారం ఉదయం 10గంటలకు భార్య శిరీషతో కలసి ద్విచక్రవాహనంపై మునగాలలోని గ్రామీణ వైద్యుడు చంద్రమౌళి ఆసుపత్రికి వచ్చారు. అక్కడ ఆయనకు రక్త పరీక్షలు చేసి వైద్యం అందించారు. అదే ఆస్పత్రిలో సాయంత్రం 4 గంటల సమయంలో వెంకటేశ్వర్లు అపస్మారకస్థితిలోకి వెళ్లాడని, గమనించిన కాంపౌండర్లు వెంటనే కోదాడకు తీసుకెళ్లాలని వాహనంలో పంపించారు. మార్గమధ్యలోనే వెంకటేశ్వర్లు మృతి చెందాడని బంధువులు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. అక్కడ ఎవరూ స్పందించకపోవడంతో రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన దిగారు. ఏ ఇంజెక్షన్లు ఇచ్చారో విచారించాలని బంధువులు పోలీసులను వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు గోవింద వీరబాబు, నాగరాజు, రామారావు, రమేష్, గోపీలు డిమాండ్ చేశారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సుమారు అరగంటకు పైగా ఆందోళన కొనసాగింది. ఇదిలా ఉండగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నడిగూడెం, మోతె ఎస్‌ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

14 వంట గ్యాస్ సిలిండర్లు సీజ్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో అక్రమంగా వినియోగిస్తున్న 14 వంట సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు బాలమణి, ఆర్‌ఐ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వివిధ హోటళ్లను, చికెన్‌సెంటర్లను తనిఖీలు నిర్వహించారు. కమర్షియల్ సిలిండర్లకు బదులుగా సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్లను వినియోగించడం గుర్తించారు. వారి నుంచి 14 సిలిండర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

చోరీకి యత్నిస్తుండగా పట్టివేత

భువనగిరి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణం కామునికాంతలో చోరీకి యత్నిస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. కామునికాంతకు చెందిన నాయిని విద్యాసాగర్ సొంతిల్లు శిథిలావస్థకు చేరడంతో తాళం వేసి కుటుంబంతో స్థానిక హెచ్‌బీ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఇదే అదునుగా రహదారుల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే ఓ గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం ఆ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి అందులోని ఇత్తడి సామాగ్రిని చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మోటార్ల దొంగల ముఠా అరెస్టు



సమావేశంలో దొంగల వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్‌పీ రమేష్

కట్టంగూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, బ్యాటరీలను చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ జిల్లా అదనపు పోలీస్ సూపరింటెండెంట్ జీ.రమేశ్ తెలిపారు. నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డితో కలిసి మంగళవారం కట్టంగూరు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితులను ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఎడ్ల సురేశ్, నాగిళ్ల ముత్తయ్య, గోపగాని రమేశ్, ఆవుల రాజాలు, నాగిళ్ల ఎల్లయ్యలు సమీప బంధువులు. వీరిలో మొదటి సురేష్, ముత్తయ్య, రమేశ్‌లు గతంలో తిప్పర్తి సమీపంలోని రైల్వేశాఖకు సంబంధించిన బ్యాటరీలను చోరీ చేసిన కేసులో జైలు జీవితం కూడా అనుభవించారు. అయినా వారు తమ ప్రవర్తనను మార్చుకోకుండా మిగతా ఇద్దరితో కలిసి వ్యవసాయ బావులు, నిర్జనంగా ఉండే ఫాంహౌజ్‌లను ఎంచుకుని మోటార్లు, బ్యాటరీలతో పాటు ఇతర వస్తువులను చోరీలకు పాల్పడ్డారు. వీరిని పట్టుకునేందుకు పోలీసులు కూడా బృందాలుగా ఏర్పడి గాలిస్తుండగానే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం కట్టంగూరు ఎస్‌ఐ రవీందర్ తన సిబ్బందితో కలిసి హైవేపై అప్రమత్తమయ్యారు. మోటార్లు, బ్యాటరీల లోడుతో వెళ్తున్న ఏపీ27వై-5920 నెంబర్ గల ఆటోను నిలిపి అందులోని ఐదుగురు నిందితులను విచారించగా వాటిని చోరీ చేసి విక్రయించేందుకు హైదరాబాద్‌కు తీసుకువెళ్తున్నట్లు అంగీకరించారని తెలిపారు. కట్టంగూరు మండలం ఈదులూరు శివారులోని వెంకటేశ్వర డెయిరీ ఫాంహౌస్‌లో, అయిటిపాములలోని ఎస్‌ఎల్‌బీసీ కాల్వ వద్ద రెండు మోటార్లు, శాలిగౌరారం మండల పరిధిలో 2 మోటార్లు చోరీ చేశారని ఈ మోటార్ల విలువ రూ.13.61లక్షలు ఉంటుందన్నారు. మొత్తం 5 నేరాలకు సంబంధించి 14 మోటార్లు, 33 బోరు పైపులు, 8 బ్యాటరీలలతో పాటు ఇతర కొన్ని వస్తువులు వీటిని తరలించేందుకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసి, రూ.1.74లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఏఎస్‌పీ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నేరస్థులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కట్టంగూరు ఎస్‌ఐ రవీందర్, సిబ్బంది బండి గిరి, శంకర్, రామ్మోహన్, సుధాకర్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

దేవరకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో కొన్నేళ్లుగా ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు భూములు కబ్జాలకు గురవుతూనే ఉన్నాయి. భూఆక్రమణలపై కలెక్టర్, లోకాయుక్తాకు ప్రజలు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ భూఆక్రమణలు ఆగడంలేదు. వక్ఫ్‌బోర్డు భూములు, డిండి మండల కేంద్రంలో నీటిపారుదలశాఖ భూములు, కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహడ్ 202 సర్వేనెంబర్‌లో భూఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. భూముల ధరలు రోజు, రోజుకు పెరిగిపోతుండడంతో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దేవరకొండ మండలం కాసారంలో సర్వేనెంబర్ 13లోని ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమించుకుని సొమ్ము చేసుకుంటున్నారు.



కొల్‌ముంతలపహడ్ జాతీయ రహదారి పక్కన చేపట్టిన అక్రమ నిర్మాణాలు

తాత్కాలిక చర్యలు

2014 నుంచి దేవరకొండలో 750, 753 సర్వేనెంబర్‌లలో వక్ఫ్‌బోర్డు భూములు ఆక్రమణకు గురవుతూనే ఉన్నాయి. జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులు దేవరకొండలో విచారణ జరిపి నోటీసులు జారీ చేసి వెళ్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహడ్‌లో 202 సర్వేనెంబర్‌లో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారన్న ఫిర్యాదులు చేస్తే రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను తాత్కాలికంగా తొలగిస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. డిండి మండల కేంద్రంలో నీటిపారుదలశాఖకు చెందిన 400 ఎకరాల భూముల్లో 50 ఎకరాలకుపైగా అన్యాక్రాంతమైనట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి.



దేవరకొండలో ఆక్రమణకు గురవుతున్న వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలిస్తున్న మునిసిపల్, వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ అధికారులు(ఫైల్)

దేవరకొండలో 227 మందికి నోటీసులు జారీ

దేవరకొండలో 753 సర్వేనెంబర్‌లో అక్రమ నిర్మాణాలు జరిపారని విచారణ జరిపి జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులు 227 మందికి నోటీసులు జారీ చేశారు. కాని ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా 753 సర్వేనెంబర్ వక్ఫ్‌బోర్డు భూములలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమూద్, దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి అక్రమ కట్టడాలను తొలగించారు. భూములను ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి సంఘటనలు దేవరకొండ డివిజన్‌లో కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నవారిపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు




ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే డివిజన్‌లో ప్రభుత్వభూములను గుర్తించి హద్దులు ఏర్పాటుచేశాం. ప్రభుత్వ వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమించుకున్నవారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం.

రమణారెడ్డి, ఆర్డీవో, దేవరకొండ

నిడమనూరులో సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి

లోకాయుక్త చైర్మన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



నిడమనూరు కోర్టులో మాట్లాడుతున్న జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

నిడమనూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిడమనూరులో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుతో పాటు సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని లోకాయుక్త చైర్మన్, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ యడవల్లి రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా నిడమనూరు మున్సిఫ్‌కోర్టును ఆయన సందర్శించారు. ఆయనకు న్యాయమూర్తి టీ.స్వప్న పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. బార్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడమనూరు కోర్టులో కేసుల తీవ్రత దృష్ట్యా అదనపు జూనియర్ సివిల్ కోర్టుతో పాటు సబ్‌కోర్టు ఏర్పాటు అవసరం ఉందన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయడంతో పాటు కక్షిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిడమనూరు కోర్టు భవన నిర్మాణం బాగుందని, అధునాతన వసతులతో రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. అదనపు కోర్టుల ఏర్పాటు కోసం న్యాయవాదులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, పీపీ సాధన, న్యాయవాదులు ఉన్నం చినవీరయ్య, మువ్వా అరుణ్‌కుమార్, బొల్లం శ్రీనివాస్, పెద్దబోయిన శ్రీనివాస్, చెన్ను సుందర్‌రెడ్డి, భగవాన్‌నాయక్, రమణారెడ్డి, రఘురామారావు, కత్తి స్వర్ణలత, వినోద్, రవి, లలిత, యామిని, మేఘారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాహితం కోసం కృషిచేయాలి



జస్టిస్ శివశంకర్‌రావుకు మొక్క అందజేస్తున్న వర్రె వెంకటేశ్వర్లు

మోత్కూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థ ప్రజాహితం కోసం పని చేసేలా కృషిచేయాలని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ జస్టిస్ బి. శివశంకర్‌రావు అన్నారు. రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ డాక్టర్ జితేందర్, అడిషనల్ డీజీపీ(లాఅండ్ ఆర్డర్)మహేష్ ఎం. భగవత్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీస్ వ్యవస్థలో ఉన్న లోపాలను సవరించి పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, పి. ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నల్లగొండ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్టు ప్రభుత్వ గవర్నమెంట్ పాలిటెక్నిక్ నల్లగొండ ప్రిన్సిపాల్ సీహెచ్ నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో వివిధ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డిప్లమో చేయాలని ఆసక్తి కలిగి ప్రవేశ పరీక్ష రాసి సీటుపొందని వారు, ప్రవేశ పరీక్ష రాయకుండా నేరుగా చేరాలనుకునే విద్యార్థులకు మంచి అవకాశమని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కళాశాల కార్యాలయంలో స్వీకరించి, సంబంధిత ధ్రువీకరణపత్రాలు జతచేసి అందజేయాలని కోరారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

హాలియా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జూలై 20న జరిగిన జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్(600) మీటర్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన హాలియా మున్సిపాలిటీలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్. పవన్‌కుమార్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 6,7 తేదీల్లో జనగాం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొనున్ననట్లు ప్రిన్సిపాల్ మోదాల రవీందర్ తెలిపారు. విద్యార్థిని కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్ అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

మూడు ఇసుక లారీల పట్టివేత

కేతేపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఏపీ నుంచి 65వ నెంబరు జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న మూడు లారీలను నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సతీష్‌వర్మ సిబ్బందితో మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాడపల్లి నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న మూడు లారీలు పట్టుబడ్డాయి. అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అవగాహన కల్పిస్తే ప్రయోజనం



- నానో యూరియా, డీఏపీ పట్ల ఆసక్తి చూపని రైతులు
- దుక్కిలో కాకుండా చేలకు పిచికారీ చేస్తే ప్రయోజనం
- ధర తక్కువ.. ప్రయోజనం ఎక్కువంటున్న శాస్త్రవేత్తలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో యూరి యా కొరత తీవ్రంగా ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా లో వర్షాలు ఎక్కువగా లేక వరి నాట్లు ముమ్మరంగా సాగడం లేదు. బావులు, బోర్ల కింద సాగు చేసిన కొద్దిపాటి వరి నాట్లకు, ఇతర మెట్ట పంటలకు వేద్దామన్నా యూరియా దొరకడం లేదు. బస్తా రూ.266. 50 విక్రయించాల్సిన యూరియాను పలుచోట్ల రూ. 350 వరకు అమ్ముతున్నారు. లేదా ఏదో ఒకటి లింక్ పెట్టి అమ్ముతున్నారు. లింక్ పెట్టి ఇచ్చిన దాంతో రైతుకు ప్రయోజనముండదు.

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు.

యూరియా కోసం రోజుల తరబడి వేచి చూస్తున్నారు, గంటలకు గంటలు లైన్‌లో నిల్చొని, ఎక్కువ ధర అయినా సరే యూరియా తీసుకెళ్తున్నారు. తప్ప అందుబాటులో ఉన్న నానో యూరియా(లిక్విడ్) వాడడం లేదు. నానో యూరియా, డీఏపీ ధర తక్కువగా ఉంది. బస్తా యూరియా ధర రూ.266.50 కాగా నానో యూ రియా అర లీటర్ ధర రూ.225. బస్తా డీఏపీ ధర రూ.1350 కాగా నానో డీఏపీ అర లీటరు ధర రూ .600. అది ఒక్క బస్తా వేసే బదులు అర లీటర్ నా నో పిచికారీ చేస్తే సరిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దుక్కిలో వేసేప్పుడు మాత్రం క్రిస్టల్ యూరియా, డీఏపీనే వేయాలని, చేలకు వేసేప్పుడు మాత్రం నానో యూరియా, డీఏపీ పిచికారీ చేస్తే మొక్కలకు బాగా పనిచేస్తుందని చెబుతున్నా రు. మొక్కలకు వేసేప్పుడు భూమిలో వేసిన ఎరువును మొక్క పూర్తిగా తీసుకోలేదని, ఎక్కువ శాతం ఎరువు వృథా అవుతుందంటున్నారు. నానో పిచికారీ చేస్తే మొక్కల ఆకులు పూర్తిగా దాన్ని వినియోగించుకుంటాయని చెబుతున్నారు శాస్త్రవేత్తలు.

అవగాహన లేమి

రైతులకు నానో యూరియా, డీఏపీ పట్ల అవగాహన ఎక్కువగా లేదు. నానో యూరియా, డీఏపీ తయారు చేసిన ఎరువుల కంపెనీలు వాటిని విక్రయించాలని ఎరువుల దుకాణాల వ్యాపా రులకు యూరియా, డీఏపీ బస్తాలు ఇచ్చినప్పుడు అంటగడుతున్నారు కానీ, వాటి వాడకంపై రైతులకు సరైన అవగాహన కల్పించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు కూడా నానో యూరియా,డీఏపీ వాడకం, వాటి ఫలితాలపై పెద్దగా ప్రచారం చేస్తున్న దాఖలాలు లేవు. ఎరువులు వెక్కువగా వెదజల్లడం, గుంటుకతోలేప్పుడు గొట్టాల ద్వారా పోయడం చేస్తున్నారు. అలా ఎరువు కొంత వృథా అవుతున్నప్పటికీ ఎరువు వేయడం సులువుగా ఉంటుంది. పిచికారి చేయడం కొంత కష్టమని రైతులు నానో యూరియా, డీఏపీ పిచికారి చేయడానికి ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా రైతులు మొక్కలకు యూరియా, డీఏపీ వేయకుండా నానో యూరియా, డీఏపీ పిచికారీ చేయాలని వ్యవసాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నానో యూరియా, డీఏపీ వాడితే ప్రయోజనం ఎక్కువ



దుక్కిలో వేసేప్పుడు సాధారణ ఎరువులు, యూరియా వేసుకోవాలి. మొక్కలు ఎదగడానికి ఎరువులు వేయాల్సి వచ్చినప్పుడు నానో యూరియా, డీఏపీ పిచికారీ చేయాలి. అలా పిచికారీ చేస్తే ఎరువు వృథా కాకుండా సద్వినియోగమవుతుంది. పిచికారి చేయడం కష్టమని రైతులు క్రిస్టల్ ఎరువులు, యూరియా తీసుకెళ్లి వెదజల్లడానికి అలవాటు పడ్డారు. అలా చేయడం వల్ల ఎరువు కొంత వృథా అవుతుంది. నానో పిచికారీ చేయడం వల్ల కష్టానికి తగిన ఫలితం ఉంటుంది. ఇప్పుడిప్పుడే కొన్ని కంపెనీలు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.

– డాక్టర్ అనిల్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త, యాదాద్రిభువనగిరి జిల్లా.

మార్కెట్లోకి వచ్చి మూడేళ్లు

ఎరువుల కంపెనీలు సుమారు మూడేళ్లగా నానో(లిక్విడ్) యూరియా, డీఏపీ తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తున్నాయి. అయినా రైతులు క్రిస్టల్ యూరియా, డీఏపీనే వాడుతున్నారు తప్ప నానో యూరియా, డీఏపీ వాడటం లేదు. ఒక్కో ఎరువుల దుకాణం ఒక్కో సీజన్‌కు 15లోడ్ల (200నుంచి 300 మెట్రిక్ టన్నులు యూరియా, డీఏపీ అమ్ముతుండగా నానో యూరియా, డీఏపీ ఒక్క కాటన్ (పది లీటర్లు)కూడా అమ్ముడు పోవడం లేదని ఎరువుల వ్యాపారులు చెబుతున్నారు. నానో యూరియా, డీఏపీ ఎమ్మార్పీ రేటు తగ్గించి ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నామని పలువురు ఎరువుల వ్యాపారులు పేర్కొంటున్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



ప్రాకార మండపంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో రెండో రోజు మంగళవారం శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు కొనసాగాయి. పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా ఆగమశాస్త్రరీతిలో ఉదయం నవకలశ స్నపన తిరుమంజనం, యాగశాలలో ద్వార తోరణ పూజ, కుంభారాధన, చక్రాబ్జ మండలారాధన, అగ్ని ప్రతిష్ఠ, చేపట్టిన అర్చకులు హోమాది పూజలు వైభవంగా నిర్వహించారు. నిత్య కైంకర్యాలు, చతుఃస్థానార్చనలు హోమం చేపట్టి, మూలమంత్ర పారాయణాలు, పంచసూక్తాలతో 108 నూలు పోగులకు అభిషేకం చేసి మాలలను తీర్చిదిద్దారు. సాయంత్రం ఆరాధన, ద్వారపూజ, మూర్తి మంత్ర విశేష హోమాలు, స్వర్ణమయ దివ్య విమాన సుదర్శ చక్రారాధన, ఆవాహనం చేసి అభిషేకించి, ఏటా ఒక రోజు వేసే పూలమాల వేశారు. ఉదయం, సాయంత్రం, పంచసూక్త, మూలమంత్ర హోమాలు చతుఃస్థానార్చనలు అనుబంధ పాతగుట్ట ఆలయంలో కూడా పాంచరాత్రాగమ రీతిలో పవిత్రోత్సవాలు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఏఈవో జూశెట్టి కృష్ణ, గజ్వేల్లి రమేష్‌బాబు, పర్యవేక్షకులు జి.శంకర్‌నాయక్, నాగుల మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేటితో పవిత్రోత్సవాల పరిసమాప్తి

రెండు రోజుల పాటు సాగిన పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, స్వామిఅమ్మవారలు, ఆళ్వార్లకు పవిత్రాధారణతో ఉత్సవాలు పరిసమాప్తి కానున్నట్లు ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి గర్భాలయంలో నిజాభిషేకం, నిత్యార్చనలు, సువర్ణ పుష్పార్చనలు పాంచారాత్రగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.15,82,026 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

సర్వే పనులపై సిబ్బందికి అవగాహన

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూముల సర్వే పనులు మంగళవారం కూడా కొనసాగాయి. వైటీడీఏ పరిధిలో ఆలయ భూముల గుర్తింపుకు ఈ నెల 2న అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డి, భువనగిరి ఆర్డీవో మాలి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో సర్వే పనులు టెంపుల్ సిటీ ప్రాంతంలో మొదలయ్యాయి. ఆలయ భూముల వైశాల్యంపై అవగాహన ఉండేందుకు భవిష్యత్తులో సీనియర్ (ప్రస్తుతం జూనియర్ సిబ్బంది) అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు పైస్థాయి అధికారులను ఆదేశించారు. సిబ్బంది సర్వేలో పాల్గొనడం వల్ల మున్ముందు ఆలయ భూములకు సంబంధించి పూర్తి అవగాహన ఉండి భూముల రక్షణ సులువు అవుతుందని ఈవో తెలిపారు.

8వ తేదీన సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

● ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలోని పర్వదినాల్లో వరలక్ష్మి వ్రతానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ వ్రతాన్ని నోముకునేందుకు మహిళలు అంతా సిద్ధం చేసుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే సిరిసంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. శ్రావణ మాసం రెండో శుక్రవారం కావటంతో వరలక్ష్మి వ్రతాలను నోముకునేందుకు మహిళలు అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేకమైన ఏర్పాట్లను చేశారు. పట్టణంలోని శేర్‌బంగ్లాలో సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. అర్చకులు కారంపూడి మోహనాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం, కుంకుమార్చనలు, ఒడి బియ్యం, ఉద్యాపనలు వంటి పూజలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి వ్రతాలను నోముకోవాలని కోరారు. అదే విధంగా తులసీనగర్‌లోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఉదయం 10.30 గంటలకు సామూహిక వ్రతాలు నిర్వహించనున్నారు. సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం కావటంతో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, అక్షర కంకణధారణ, సరస్వతి సూక్త హోమం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. వరలక్ష్మీ వ్రతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆ ఆలయ మేనేజర్ తెలిపారు. పట్టణంలోని వీటీ కాలనీలో ఉన్న శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయం, బీట్ మార్కెట్‌లోని శ్రీ రామకోటి స్థూప దేవాలయం, పలు దేవాలయాల్లో వరలక్ష్మి వ్రత వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

9న శని త్రయోదశి పర్వదినం..

శ్రావణ మాసంలో వచ్చే పర్వదినాల్లో శని త్రయోదశి పండుగ ఒకటి.. ఈ పండుగ ఈ నెల 9వ తేదీన పట్టణంలోని పలు ఆలయాల్లో నిర్వహించనున్నారు. శనివారం రోజున నవగ్రహ ప్రత్యేక పూజలు, శని పూజలు నిర్వహించనున్నారు. తులసినగర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో, వీటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో, పలు ఆలయాల్లో శని త్రయోదశి వేడుకలు జరగనున్నాయి. అందుకుఏర్పాట్లను కూడా నిర్వాహకులు సిద్ధం చేశారు.

దండు మైసమ్మ హుండీ ఆదాయం రూ.7.52లక్షలు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో హుండీ లెక్కింపును మంగళవారం నిర్వహించారు. నాలుగు నెలల 10 రోజులకు హుండీలో రూ.7,52,460లను భక్తులు కానుకల రూపంలో లభించింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈవో కుశలయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూసీ పరవళ్లు..



యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం భీమ లింగం కత్వ వద్ద పరవళ్లు తొక్కుతున్న మూసీ

హైదరాబాద్ నగరం ఎగువ ప్రాంతంతో పాటు జిల్లాలో కురుస్తున్న వర్షానికి వలిగొండ మండలం సంగెం భీమలింగం కత్వ వద్ద మూసీ ప్రవహిస్తూ పరవళ్లు తొక్కుతోంది. చెరువులు కుంటలకు నీరు చెరుతోంది. మూసీ నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున మూసీ పరివాహక ప్రాంతాల్లో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.


● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి-యాదాద్రి

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో: రెండు క్రస్టు గేట్ల ఎత్తివేత

● *4800 క్యూసెక్కుల వరద దిగువ మూసీకి విడుదల*

కేతేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్దదైన మూసీ ప్రాజెక్టుకు మంగళవారం ఎగువ నుంచి వరద నీటి రాకడ పెరిగింది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేనందునవారం రోజులుగా మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో లేదు. ఇన్‌ఫ్లో పడిపోవడం, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేస్తున్నందున ప్రాజెక్టు నీటిమట్టం వారం రోజుల నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆది, సోమవారాల్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వరద నీటితో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేకున్నా హైదరాబాద్‌లో కురిసిన వర్షంతో వరద నీరు దిగువన ఉన్న మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో సోమవారం సాయంత్రానికి 1248.48 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 3900 క్యూసెక్కులుగా నమోదైంది. ఇది సాయంత్రానికి మరింత పెరిగి నాలుగు వేల క్యూసెక్కులకు చేరింది. రాత్రికి ఇన్‌ఫ్లో మరింత పెరిగే వీలుందని భావించిన డ్యాం అధికారులు మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రాజెక్టు రెండు క్రస్టు గేట్లను ఎత్తి వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేయాలని నిర్ణయించారు.

ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం నుంచి సోషల్ మీడియా ద్వారా సూర్యాపేట జిల్లా పరిధిలోని రత్నపురం, రామారం, టేకుమట్ల, కాసరబాద, పెన్‌పహాడ్ అనాజిపురం, అనంతారం, దోసపహాడ్, దాచారం, సజ్జపురం, ఎల్లారం, సోమారం, చింతకుంట్ల, మూసీఒడ్డు సింగారం, ఎల్లాపురం, శూన్యంపహాడ్, నల్లగొండ జిల్లా పరిధిలోని బొప్పారం, కాసనగోడు, చీకటిగూడెం, ఉప్పలపహాడ్, కొత్తపేట, కొప్పోలు, భీమారం, ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం, రావులపెంట, నర్సింహులగూడెం, తక్కెళ్ళపహాడ్, తడకమళ్ళ, కాల్వపల్లి ఆలగడప, ముల్కలకాల్వ, రాయినిపాలెం, కేశవాపురం, తుంటకుంటవిల్లా, వాడపల్లి, వజీరాబాద్ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయా గ్రామాల రైతులు తమ పాడి పశువులు, మేకలు, గొర్రెలు, వ్యవసాయ పశువులను మేతకు, తాగునీటికి మూసీ నది పరిసరాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు కూడా నది పరిసర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అన్నారు. ఆ తర్వాత వరద ఉధృతి మరింత పెరిగితే గేట్ల నిర్వహణ ఇబ్బందిగా మారుతుందని భావించిన మూసీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ప్రాజెక్టు 3, 8వ నెంబరు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 4800క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి వదిలారు. ఎగువ నుంచి వచ్చే వరద ఉధృతి పెరిగితే మరిన్ని క్రస్టుగేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తామని డ్యాం ఏఈఈ బాడిశ మధు తెలిపారు. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 64313అడుగులు(4.02టీఎంసీలు)గా ఉంది.



మూసీ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళుతున్న నీరు

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం

భువనగిరి రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేవరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని భువనగిరి, నకిరేకల్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, వేముల వీరేశం అన్నారు. చలో డిల్లీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భువనగిరికి చెందిన కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చలో డిల్లీ కార్యక్రమంలో భాగంగా జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాశం శివానంద్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, వెంకటేశ్, పద్మ కృష్ణగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం

ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలి

ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్

నాగార్జునసాగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలో నాణ్యమైన ఉచిత విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ ఎల్.భీంసింగ్ అన్నారు. మంగళవారం నాగార్జునసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం పలు సంస్కరణలను తీసుకువచ్చిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా విద్యాబోధన చేస్తూ, విద్యార్థులను పోటీపరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతోపాటు ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యనభ్యసించే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్‌చంద్ర, గోపాలకృష్ణ, ఉపేంద్రాచారి, వినోద్, పాల్గొన్నారు.

కాల్వల్లో గుర్రపు డెక్కలు తొలగించరా..

జిల్లాలో పంట పొలాలకు వెళ్లే కాల్వల్లో గుర్రపు డెక్కలు నిండాయి. వలిగొండ మండలం పరిధిలోని రైతులు మూసీ ప్రధాన సాగునీటి వనరులు వరి, కూరగాయల సాగు చేస్తుంటారు. ప్రధాన కాల్వలైన సంగెం, గోకారం, నాగారంతో పాటు మూసీ కాల్వల్లో గుర్రపు డెక్కలు నీటి ప్రవాహంతో అడ్డుగా ఉన్నందున నీరు ముందుకు వెళ్లడం లేదు, ఫలితంగా పంట పొలాలు, చెరువులోకి నీళ్ల రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల మరమ్మతుల పేరిట అధికారులు ఏటా లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు. కొన్ని చోట్ల హడావిడిగా గుర్రపు డెక్కలను తొలగించి, మరి కొన్ని చోట్ల వదిలివేయడంతో సమస్య క్షేత్రస్థాయిలో పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వం సాగు నీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నా, అధికారులు నిర్లక్ష్యం వీడి, కాల్వల్లోని గుర్రపు డెక్కలు, ముళ్ల కంచెలు తొలగించి నీటి ప్రవాహం సాఫీగా వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మూసీ పరివాహక రైతులు కోరుతున్నారు.



గోకారం కాల్వలో అల్లుకున్న గుర్రపు డెక్కలు



వలిగొండ మండలం సంగెం మూసీ వంతెన వద్ద చెత్త చెదారం, గుర్రపు డెక్కలు



● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి-యాదాద్రి

తల్లిపాల వారోత్సవాలపై అవగాహన

కట్టంగూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కట్టంగూరులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమావేశంలో తల్లిపాల వారోత్సవాలపై అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో హస్రా అంజూమ్, సూపర్‌వైజర్ శారదారాణి, వైద్యాధికారి శ్వేత, బీహెచ్‌వో నర్సింహారావు, ఏఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

మాజీమంత్రి జగదీశ్‌రెడ్డిని విమర్శించడం సరికాదు

కట్టంగూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల బాలరాజు విమర్శించడం తగదని బీఆర్ఎస్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు అన్నారు. మంగళవారం కట్టంగూరులో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయంగా అవకాశం కల్పించి కార్పొరేషన్ చైర్మన్ పదవి పొందిన దూదిమెట్ల బాలరాజు జగదీశ్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

వెంటాడుతున్న కరెంట్ కష్టాలు

» విద్యుత్ సమస్యలతో ప్రజల అవస్థలు
» ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే రైతులకు తిప్పలే
» అందుబాటులో ఉండని సిబ్బంది



తిప్పర్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ కష్టాలు వెంటాడుతున్నాయి. లైన్‌మన్, ఏఎల్ఎంలు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు విద్యుత్ లైన్లలో ఏర్పడే సమస్యలు పరిష్కరించాలి. కానీ ఆశాఖకు సంబంధించిన అధికారులంతా పట్టణ ప్రాంతాల్లోనే ఉంటుండడంతో గ్రామంలో ఏ చిన్న విద్యుత్ సమస్య వచ్చినా వారు వస్తేనే సమస్య తీరేలా మారింది. ముఖ్యంగా వ్యవసాయ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లవద్ద ఫ్యూజ్ వేయాలన్నా విద్యుత్‌పై అవగాహన లేని రైతులు అదే గ్రామంలో ప్రైవేట్ వ్యక్తిని సంప్రదించి పనులు చేయించుకునే పరిస్థితి ఉంది. కొన్ని సందర్భాల్లో అనుభవం లేనివారు విద్యుత్ పనులు చేసే సమయం లో పలు గ్రామాల్లో విద్యుదాఘాతానికి గురై గాయపడి ప్రాణాల మీదికి తెచ్చుకున్న సంఘటనలు ఉన్నాయి. మండలంలో మొత్తం 26గ్రామ పంచాయతీలు ఉండగా, అవాస గ్రామాలతో కలిపి 45గ్రామాలున్నాయి. కానీ విద్యుత్‌శాఖలో మాత్రం అంతా కలిసి 14మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు.

రైతుల జేబుకు చిల్లు

గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏ సమస్య వచ్చినా, ఎర్త్‌కు సంబంధించిన సమస్యలున్నా సంబంధింత అధికారులు సత్వరమే సమస్య పరిష్కరించాలి. కానీ లైన్‌మన్, జేఎల్ఎం, ఏఎల్ఎంలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే ప్రదేశానికి దూరంగా నివాసముంటున్నారు. మరికొంత మంది లైన్‌మన్లు ఆయా గ్రామాల్లో విద్యుత్‌పై అనుభవమున్న వారిని ఎంపిక చేసుకొని వారికి డబ్బులిచ్చి మిగతా రైతుల వద్దనే తీసుకోవాలని సూచిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రైతులకు సమయానికి నీటి అవసరాలు ఉన్నందున స్థానికంగా ఉండే సహాయకులతో పని చేయించుకొని కొంత మొత్తం చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తమకు అదనంగా భారం పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. మండలకేంద్రంతో పాటు పజ్జూరు, మామిడాల గ్రామాల్లో చిన్న వర్షం వచ్చినా విద్యుత్‌ను వెంటనే నిలిపివేస్తారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎల్‌టీ లైన్ల వద్ద లూజ్ కనెక్షన్లు ఉన్నప్పుడు పట్టించుకోకపోవడంతో గాలికి కదిలి ట్రిప్ అవుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. మండలకేంద్రంలో సైతం నిత్యం ఏదో ఒక సమస్య ఉందని చెప్పి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని స్థానిక దుకాణదారులు చెబుతున్నారు.

చిన్న వర్షం వచ్చినా కరెంట్ తీస్తారు



తిప్పర్తి మండల కేంద్రంలో నిత్యం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. చిన్న వర్షం వచ్చినా కరెంటు తీస్తారు. ఇప్పుడు రాదు టైం పడుతుందని చెబుతారు.
-జాకటి ఆనంద్, మెడికల్‌హాల్ నిర్వాహకుడు, తిప్పర్తి

వీధి లైట్లు వెలగడం లేదు



చిన్న చిన్న సమస్యలతో నెల రోజులుగా గ్రామంలో వీధి లైట్లు వెలగడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు పట్టించుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలి.
- నేలపట్ల చిరంజీవి, పజ్జూరు గ్రామస్థుడు

సరిపడా సిబ్బంది లేరు

మండలంలో అన్ని గ్రామాలకు సరిపడా సిబ్బంది లేనిది వాస్తవమే. కొన్ని గ్రామాలకు ఇన్‌చార్జిలుగా కొందరు ఉన్నారు. అందు వలన ఆలస్యం జరిగి ఉండవచ్చు. ఉన్నతాధికారులకు తెలియజేసి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం. - శివకుమార్, ఏఈ, తిప్పర్తి

మర్రిగూడ పీహెచ్‌సీ తరలింపు?

» శివన్నగూడేనికి తరలించే యోచన » ఇప్పటికే మర్రిగూడలో 30 పడకల ఆస్పత్రిలో సేవలు



శివన్నగూడేనికి తరలించనున్న మర్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మర్రిగూడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండలంలోని శివన్నగూడ గ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండలకేంద్రంలో ఇప్పటికే 30పడకల కమ్యూనిటీ ఆరోగ్య ఆస్పత్రిలో ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. 30 పడకల కమ్యూనిటీ ఆరోగ్య ఆస్పత్రి భవనం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి ఒకేచోట ఉన్నాయి. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు రెండు ఆసుపత్రిలో ఎక్కడికి వెళ్లి వైద్యం చేయించుకోవాలో తెలియని పరిస్థితి ఉంది. అదేవిధంగా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైనందున మండల ప్రజలకు ఆరోగ్య వైద్య సేవలు అందుతున్నప్పటికీ, దూర ప్రాంతంలో ఉన్న ప్రజలకు, రోగులకు, వైద్యులు అందుబాటులో ఉంటూ మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని అధికారులు భావిస్తున్నారు. అత్యవసర వైద్య సేవలు అందించి రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించకుండా, మర్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడకు తరలించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. శివన్నగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం స్థల సేకరించడమా లేదా అద్దె భవనాన్ని పరిశీలించాలని మర్రిగూడ ప్రాథమిక ఆరోగ్య ఆస్పత్రి వైద్యాధికారిని ఉన్నతాధికారులు ఆదేశించారు. మర్రిగూడ ఆరోగ్య వైద్య సిబ్బంది భవనం ఏర్పాటులో నిమగ్నమై ఉన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న న్యాయవాది వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమానికి కృషిచేస్తానని, ఎన్నికల్లో తనను గెలిపించాలని న్యాయవాది రావుల వెంకట్‌రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బార్ కౌన్సిల్ హాల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులంతా సహకరించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారంలో తాను వెన్నంటి నిలుస్తానన్నారు. తాను నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల గ్రామవాసినని తెలిపారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నగేష్, సీనియర్ న్యాయవాదులు గోలి అమరేందర్‌రెడ్డి, కాంచనపల్లి జవహర్‌లాల్, మేరెడ్డి నర్సింహా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పటేల్ రెడ్డి, జమీల్, కిషోర్, నామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, మురళి, రాములు, నర్సింహ, శేఖర్ తదితరులు ఉన్నారు.

గణేష్ మండపాల వద్ద సౌకర్యాలు కల్పిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ అహ్మద్

రామగిరి ఆగస్టు, 5(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినాయక మండపాల వద్ద తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మునిసిపల్ కమిషనర్ అహ్మద్ తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. మండపాల వద్ద ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు డీఈలు, ఏఈలు ఉన్నారు.

ఆసరా పింఛన్లు పెంచాలి



మాట్లాడుతున్న నరేష్

చిట్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ డిమాండ్ చేశారు.చిట్యాలలో మంగళవారం మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల సంఘం అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఆసరా పింఛన్లు రూ.4 వేలు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని కోరారు. ఈ నెల 11న చిట్యాలలో నిర్వహించే చేయూత పింఛన్‌దారుల మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు.కార్యక్ర మంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, మేడి శంకర్, కొత్త వెంకన్న, ఎరసాని గోపాల్, హైమత్‌ఖాన్, నక్క కృష్ణ, మేడి కృష్ణ, సామ రవీందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గాదె రాజు పాల్గొన్నారు.

అసైన్డ్ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

చిట్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూముల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అసైన్డ్‌దారుల ప్రయోజనాలు కాపాడాలని, అసైన్డ్ భూములను ఆక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, పన్నాల లక్ష్మారెడ్డి, ఉంద్రాతి కృష్ణ, నాగిల్ల యాదయ్య, ఊయ్యాల లింగస్వామి, ఏనుగు నర్సిరెడ్డి, భైరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని విక్రయించిన కానిస్టేబుళ్ల సస్పెన్షన్

తిప్పర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లిన ద్విచక్ర వాహనాన్ని విక్రయించిన కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. తిప్పర్తి ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎండీ. వసీమ్, ఉపేందర్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మండలంలోని మల్లెపల్లివారిగూడెం గ్రామ సమీపంలో నిర్జన ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తులు జూలై నెలలో ఓ ద్విచక్ర వాహనాన్ని వదిలి వెళ్లారు. వసీమ్, ఉపేందర్‌లు ఆ వాహనాన్ని తీసుకొచ్చి స్థానికంగా మరమ్మతులు చేయించి సర్వారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించారు. ఆ ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లిన వ్యక్తి అదే గ్రామంలోని మరో వ్యక్తికి దానిని విక్రయించాడు. పోలీసుల దగ్గర ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి పూర్తి డబ్బులు చెల్లించలేదు. డబ్బులు చెల్లించాలని కానిస్టేబుళ్లు ఒత్తిడి చేస్తుండడంతో సదరు వ్యక్తి తనను ఇబ్బంది పెడుతున్నారని ఎస్ఐకు సమాచారమిచ్చాడు. ఈ ఘటనపై ఎస్ఐ శంకర్ విచారణ చేసి జిల్లా ఎస్పీకి నివేదిక ఇచ్చారు. వాహనాన్ని విక్రయించిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్‌చేస్తూ ఎస్పీ శరత్‌చంద్రపవార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

మిషన్ కాకతీయతో ప్రజాధనం దుర్వినియోగం



సోలిపురంలో చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మిషన్ కాకతీయ పేరుతో గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సోలిపురం గ్రామంలో మార్నింగ్ వాక్ చేస్తూ కబ్జాకు గురైన చెరువును పరిశీలించారు. మునుగోడు నియోజకవర్గంలో వర్షపు నీటి పైన ఆధారపడి రైతులు వ్యవసాయం చేసుకుంటారని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచుకోవడానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. కబ్జాకు గురైన చెరువు భూములను సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పూడిక మట్టిని రైతులు తీసుకెళ్లి వారి పొలాల్లో చల్లుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. సోలిపురం వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. గ్రామాల్లోని చిన్నచిన్న సమస్యలకు ప్రతిసారి పోలీస్ స్టేషన్లకు వెళ్లొద్దని , గ్రామ పెద్దలందరూ కూర్చొని మాట్లాడి సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని గ్రామస్థులకు సూచించారు. మండలంలోని కొరటికల్ గ్రామంలో 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూర్ మార్కెట్ చైర్మన్ దోటీ నారాయణ, డీఈ అన్నయ్య, చండూరు ఆర్డీవో శ్రీదేవి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్, ఇన్‌చార్జి తహసీల్దార్ నరేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయభాస్కర్, పంచాయతీరాజ్ ఏఈ సతీష్‌రెడ్డి, సర్వేయర్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్‌రెడ్డి, అనంత వీణస్వామి గౌడ్, నాయకులు మిరియాల వెంకన్న, నకరికంటి యాదయ్యగౌడ్, ఆరేళ్ల సైదులు, యాదగిరి, పోలగోని ప్రకాష్, చెరుపల్లి వెంకన్న, తీర్పరి ఆంజనేయులు, ఏడీ అశోక్, ఏఈ సురేష్, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి ఉన్నారు.

రైతులు విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ: విద్యుత్ సబ్‌స్టేషన్‌తో వ్యసాయ రంగానికి విద్యుత్ సమస్య తీరుతున్నందున రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండలంలోని నరసింహుల గూడెం, రాందాస్‌తండా, జాన్‌నాయక్ తండా, గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన 33/11కేవీ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రాంతంలో సబ్ స్టేషన్ ఏర్పాటుతో రైతులకు విద్యుత్ సమస్య లోటు తీరిందన్నారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి రవీందర్‌రెడ్డి, పానుగంటి వెంకన్న గౌడ్, వెలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, ఎరెడ్ల రఘుపతి రెడ్డి, నాగరాజు, శివ, బిక్షం, కాంగ్రెస్ నాయకులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న చండూరు సీఐ ఆదిరెడ్డి

కనగల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చండూరు సీఐ ఆదిరెడ్డి సూచించారు. మండలంలోని ఎస్‌లింగోటం గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ కళాజాతా నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల కట్టడి, డిజిటల్ అరెస్టులు, సీఈఆర్‌వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా నేరాలు జరిగే తీరు కూడా మారుతుందన్నారు. ప్రజలు మోసాలకు గురికాకుండా జాగురతతో ఉండాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజీవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌పోచమళ్ల లింగయ్యగౌడ్, పీసీలు తదితరులు ఉన్నారు.

మద్యందుకాణంలో దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

శాలిగౌరారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని మద్యం దుకాణంలో పని చేస్తున్నవారిపై దాడిచేసిన బీజేపీ మండల అధ్యక్షుడు తోట వినోద్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బకరం శ్రీనివాస్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బాధితులతో కలిసి నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేయడం పట్ల దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. నిత్యం దళితులపై దాడులు జరగడం అవమానకరమని, దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలని కోరారు. వీధి రౌడీగా ప్రవర్తిస్తున్న తోట వినోద్ కుమార్‌ను బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులు, బీఎస్పీ నల్లగొండ నియోజకవర్గం ఇన్‌చార్జి కోడి భీం ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు బట శ్రీనివాస్, తోటకూరి సతీష్ బట్ట కిరణ్ బట్ట రఘు తాటిపాముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలంలోనూ విద్యుత్‌కు డిమాండ్

(5వ పేజీ తరువాయి)

పెరిగినట్టు చెబుతున్నారు.

భారీగా పెరిగిన వ్యవసాయ విద్యుత్ వినియోగం

గత ఏడాది ఇదే సీజన్‌తో పోల్చితే ఈ ఏడాది వానాకాలంలో వ్యవసాయ విద్యుత్ వినియోగం సుమారు 13 నుంచి 15లక్షల యూనిట్ల (సుమారు 1.5మి.యూ) వరకు పెరిగినట్టు విద్యుత్ అధికారులు అంచనావేస్తున్నారు. నాన్ ఆయకట్టు ప్రాంతాలతోపాటు నాగార్జునసాగర్ ఆయకట్టులోనూ ప్రస్తుత సీజన్‌లో బోరుబావుల కింద ఇప్పటికే నారుమళ్లు, ఇతర ఆరుతడి పంటల సాగు భారీగా పెరిగింది. దీంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగింది. వీటితోపాటుగా గత ఏడాది కంటే అధికారికంగా వ్యవసాయ కనెక్షన్లు మూడువేలకు పైగా పెరిగాయి. దీంతో విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు, ఏఎమ్మార్పీ, మూసీ కాల్వల ద్వారా ఆయకట్టుకు నీరిస్తున్నందున్న ఆగస్టు నుంచి బోరుబావుల వినియోగం తగ్గుతుందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు.

జాబ్‌కార్డు ప్రకటించాలి

కట్టంగూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు జాబ్‌కార్డు ప్రకటించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పెంజర్ల సైదులు డిమాండ్ చేశారు. కట్టంగూరులో మంగళవారం ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన మండల మహాసభలో మాట్లాడారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశ వర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పెంజర్ల సైదులు, అధ్యక్షురాలిగా చెవుగోని ధనలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పార్వతమ్మ, భారతి, ప్రధాన కార్యదర్శులుగా భూపతి రేణుక, సహాయ కార్యదర్శిగా అనిత, పద్మావతి, కోశాధికారిగా రేణుక, సభ్యులుగా సుజాత, సైదమ్మ, శోభ, సంతోష ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు చెవుగోని ధనలక్ష్మి, పొన్న అంజయ్య, పొడిచేటి సులోచన, చెరుకు జానకి, భూపతి రేణుక తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న అర్చకులు

కనగల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ, అభిషేక పూజల్లో పాల్గొన్నారు. చీరసారె ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థులకు టై, బెల్ట్, షూ అందజేస్తున్న ఎంఈవో సుధాకర్‌రెడ్డి

చండూరు రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో సుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపురం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గిరి కరుణాకర్ సమకూర్చిన టై, బెల్ట్, బ్యాడ్జ్, షూస్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కృషిచేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయన్నారు. కార్యక్రమంలో ఎంపీ యూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు భూతం ముత్యాలు, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు డి. ముఖేష్, ఉపాధ్యాయులు ఏ. భద్రయ్య, వి. భగవంతురెడ్డి, జే. పావని, డి. అరుణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.5లక్షల నష్టపరిహారం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని ఇంటి నిర్మాణంలో ప్రమాదవశాత్తు మృతిచెందిన గజ్జి సైదులు కుటుంబానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంటి యజమాని నుంచి రూ. 5 లక్షల నష్టపరిహారం ఇప్పించారు. సుందరయ్య సెంట్రింగ్ యూనియన్(సీఐటీయూ) కార్యాలయంలో మంగళవారం బాధితకు కుటుంబానికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షుడు ఎండీ. సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, సీఐటీయూ పట్టణ కన్వీనర్ రవీందర్, లింగయ్య, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి మృతికి సంతాపం

నార్కట్‌పల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లికి చెందిన అర్థం కృష్ణవేణి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె మృతికి వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు బిల్లకంటి శ్రీకాంత్, ఇడుకుళ్ల బిక్షమయ్య, బాశెట్టి శ్రీనివాస్, నల్లా వాసుదేవ్, పసునూరి శ్రీనివాస్, పాల్వాయి భాస్కర్‌రావు, శ్రీనివాస్ సంతాపం తెలిపారు. వివిధ పార్టీల నేతలు జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు.

తల్లి పాలు బిడ్డలకు అమృతం

శాలిగౌరారం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డలకు అమృతమని సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మండలంలోని వల్లాల గ్రామ అంగన్‌వాడీకేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డ పుట్టగానే ముర్రు పాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్యామలక్ష్మి, శోభారాణి, సైదమ్మ, ఏఎన్ఎం జయమ్మ, ఇందిరా, ఆశా వర్కర్లు భవాని, ప్రమీల, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో నేడు గద్దర్ వర్ధంతి సభ

మునుగోడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మునుగోడు అంబేడ్కర్ చౌరస్తాలో నేడు ప్రజాయుద్ధనౌక గద్దర్ ద్వితీయ వర్ధంతి నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు వనం లింగయ్య, మాల్గ యాదన్న మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆటా, పాట ప్రదర్శన సభకు తెలంగాణవాదులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మల్లారెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి

శాలిగౌరారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అంతరాలు లేని నూతన వ్యవస్థ కోసం, దోపిడీ పీడన రద్దు కావాలని, దున్నే వాడికే భూమి దక్కాలనే నినాదంతో పోరాడిన యానాల మల్లారెడ్డి ఉద్యమ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ అన్నారు. యానాల మల్లారెడ్డి 23వ వర్ధంతి సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో ఊట్కూరులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ పటేల్ కుమారుడిగా అగ్రకుల, ధనిక రైతు కుటుంబంలో పుట్టిన యానాల మల్లారెడ్డి పీడితుల పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి రావుల లింగయ్య, నాయకులు వేముల శంకర్, బండారు వెంకన్న, సిలివేరు జానయ్య, అంబటి వెంకటేశం, మామిడోజు వెంకటేశ్వర్లు, అంబటి నరసయ్య, పోలే పవన్, ఎల్లమల్ల సైదులు, నిద్ర వెంకన్న, అనిల్, వేముల శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 33.5
కనిష్ఠం 23.2
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 6 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	44,271	44,271
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.13 (4.02)	5,215	4,000
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.981 (44.1813)	28,159	17,000

చికెన్ ధరలు లైవ్: రూ.125 డ్రెస్: రూ.190 స్కిన్‌లెస్: రూ.220



వానాకాలంలోనూ విద్యుత్ డిమాండ్

వానాకాలంలోనూ జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. గృహ అవసరాలకు, పరిశ్రమలకు, వాణిజ్య అవసరాలకు, పండ్లతోటలకు వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటే, వానాకాలంలో వ్యవసాయ కనెక్షన్లకు ఎక్కువ ఉంటుంది. అందుకు భిన్నంగా ఈ సీజన్‌లో విద్యుత్ వినియోగం భారీగా నమోదవుతోంది. గత ఏడాది ఇదే సమయంలో వినియోగించిన విద్యుత్ కంటే ఈ సీజన్‌లో సగటున రోజుకు 2మిలియన్ యూనిట్లు అదనంగా నమోదవడం ఒక రికార్డు. గత ఏడాది ఇదే సీజన్ కంటే ప్రస్తుతం సగటున ప్రతిరోజూ రూ.50లక్షల విలువైన విద్యుత్ వినియోగం అవుతున్నట్టు అధికారులు అంచనావేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- వ్యవసాయ వినియోగం పెరగడమూ కారణం
- గృహవిద్యుత్‌కూ గతం కంటే ఎక్కువే
- సగటున 2మి.యూ అదనపు డిమాండ్

జిల్లాలో గత ఏడాది ఇదే సీజన్‌తో పోలిస్తే, వానాకాలంలోనూ గృహ వినియోగదారుల విద్యుత్ వినియోగ డిమాండ్ ఏమాత్రం తగ్గకపోగా పెరిగింది. సాధారణంగా జూలై నెల నుంచి ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం తగ్గుతుంది. గీజర్లు, వాటర్ హీటర్ల వినియోగం కొంతమేర ఉంటుంది. కాగా, అందుకు భిన్నంగా వాటర్ హీటర్లు, గీజర్ల వినియోగం పెరగడమేగాక, ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం ఏమాత్రం తగ్గలేదు. జిల్లాలో గత ఏడాది ఈ సీజన్ కంటే ఈ ఏడాది సగటున రోజుకు కనీసం మూడు లక్షల యూనిట్ల వరకు అదనపు వినియోగం పెరిగినట్లు విద్యుత్ అధికారులు అంచనావేస్తున్నారు. ఏటా పట్టణీకరణ పెరగడంతో పాటు, వేసవి కంటే వానాకాలం సీజన్ ఆరంభం నాటికి స్కూళ్లు, కాలేజీలు తెరుచుకోవడం వంటి కారణాలతో గృహవినియోగ విద్యుత్

- మిగతా 8వ పేజీలో...

నాలుగు రోజులుగా విద్యుత్ వినియోగం ఇలా..

తేదీ	ఈ ఏడాది (మి.యూ)	గత ఏడాది	పెరుగుదల
జులై 31	18.07	16.08	1.99
ఆగస్టు 1	18.75	16.09	2.66
ఆగస్టు 2	12.00	17.26	-5.26
ఆగస్టు 3	18.78	17.60	1.18

వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగింది

గత ఏడాది కంటే ఈ సీజన్‌లో వ్యవసాయ విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. వర్షాలు తక్కువగా ఉండడం, ఆయకట్టులోనూ కాల్వలకు నీరివ్వకపోవడం వంటికారణాలతో రైతులు బోరుబావుల కింద సాగు చేపట్టారు. అందుకే గత సీజన్ కంటే భారీగా విద్యుత్ వినియోగం పెరిగిందని అంచనా వేస్తున్నాం. ఈ సీజన్‌లో అదనపు కనెక్షన్లే దాదాపు మూడువేలకు పైగా ఉన్నాయి. అదేవిధంగా గృహవినియోగం విద్యుత్ కూడా పెరిగింది. ఎంత వినియోగం పెరిగినా ప్రభుత్వం నిరంతర సరఫరాకు అవసరమైన విద్యుత్‌ను అందిస్తోంది. వినియోగదారులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వెంకటేశ్వర్లు, ఎస్ఈ

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు అలంకరించే పవిత్ర మాలలను చూపుతున్న ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో రెండో రోజు మంగళవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఉదయం ఆగమ శాస్త్రరీతిలో నవకలశ స్నపన తిరుమంజనం, ద్వారతోరణ పూజ, కుంభారాధన, చక్రాబ్జ మండలారాధన, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పంచసూక్తాలతో 108 నూలు పోగులకు అభిషేకం చేసి మాలలను తీర్చిదిద్దారు. సాయంత్రం విశేష హోమాలు, స్వర్ణమయ దివ్య విమాన సుదర్శ చక్రారాధన, అభిషేకాలు కొనసాగాయి.

7

● ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట



'పుట్టపాక' చేనేత కళాకారులకు పురస్కారాలు

- ముగ్గురికి కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు

6

దొడ్డు బియ్యం వేలం

- సన్న బియ్యం పంపిణీతో గోదాముల్లో మిగిలిన దొడ్డు బియ్యం
- నాలుగు నెలలుగా గోదాములు, రేషన్ డీలర్ల వద్దే..
- క్షేత్రస్థాయి నుంచి సమాచారం సేకరిస్తున్న అధికారులు



రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. అయితే అంతకుముందు పంపిణీకి సిద్ధంగా ఉంచిన, రేషన్ దుకాణాల్లో మిగిలిన దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలని నిర్ణయించింది. దీంతో బియ్యం నిల్వలపై సమాచారాన్ని సేకరిస్తోంది. అంతేగాక జిల్లాలోని నిల్వలను ఎక్కడికి చేరుస్తారనే విషయంపై వారం రోజుల్లో స్పష్టత రానుంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

దొడ్డు బియ్యం గోదాములు, రేషన్‌దుకాణాలకు చేరి నాలుగు నెలలు అవుతోంది. ఎక్కువ సమయం అలాగే ఉంచితే బియ్యానికి పురుగుపట్టే అవకాశం ఉంది. దీంతో ఆలస్యం చేస్తే బియ్యం దేనికీ ఉపయోగపడవని, వాటిని వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

గోదాములు, రేషన్‌దుకాణాల పరిశీలన

సాధారణంగా రైస్ మిల్లుల నుంచి తొలుత స్టేజ్-1 గోదాములకు, ఆ తర్వాత స్టేజ్-2 గోదాములకు, అక్కడి నుంచి రేషన్‌దుకాణాలకు బియ్యం సరఫరా అవుతుంది. గోదాముల్లో ఎంత మేరకు నిల్వలు ఉన్నాయనేది కాగితాల్లో నమోదు చేసినా వాస్తవంగా దుకాణాల్లో ఉన్నాయా? లేదా? అనేది అధికారులు పరిశీలిస్తున్నారు. వేలం వేయాలంటే నిల్వలే ముఖ్యం. దీంతో ఏ మేరకు దొడ్డు బియ్యం అందుబాటులో ఉందో రెవెన్యూ, సివిల్‌సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించి పరిశీలిస్తున్నారు. గోదాములను తనిఖీలు చేసి స్టేజ్-1, స్టేజ్-2 నిల్వలపై ఆరా తీస్తున్నారు. ఎఫ్‌సీఐ నుంచి స్టేజ్-1 గోదాముకు వచ్చిన నిల్వలు, దుకాణాలకు సరఫరా చేయగా స్టేజ్-2 గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యం వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, అప్పటికే గోదాములు, దుకాణాలకు ఆ నెల కోటా దొడ్డు బియ్యం సరఫరా అయింది. మూడు నెలల కోటాను ముందుగానే జూన్‌లో పంపిణీ చేయగా, సెప్టెంబరు వరకు రేషన్‌దుకాణాలు మూసే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దొడ్డు బియ్యం నిల్వలపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఒక్క యాదాద్రి జిల్లాలో 12వేల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి.

వారబందీ విధానంలో నీరు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వారబందీ విధానంలో సాగునీటిని విడుదల చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఏఎమ్మార్పీ కాల్వలకు సాగునీరందించే నాలుగు మోటర్లల్లో ఒకటి మరమ్మతుకు గురైందని, మూడో మోటార్ ట్రిప్ కావడంతో పూర్తిస్థాయిలో నీరు రావడం లేదన్నారు. ఉదయ సముద్రం నుంచి 100 క్యూసెక్కుల నీరు తక్కువగా వస్తోందన్నారు. అయితే మోటారు మరమ్మతుకు ఒక రోజు సమయం పట్టే అవకాశం ఉన్నందున సాగు నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉదయ సముద్రం నుంచి 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, అదనంగా మరో రోజు ఇలాగే కొనసాగించాలన్నారు. ప్రస్తుతం ఆయకట్టుకు మాత్రమే సాగునీటిని అందిస్తామని, ప్రస్తుత పరిస్థితుల్లో చెరువులకు నీటిని ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. నిర్దేశించిన నాలుగు నెలల సమయం వరకు ఎట్టి పరిస్థితుల్లో చెరువులను నింపేది లేదని తెలిపారు. నాలుగు మోటర్లు పూర్తిస్థాయిలో పనిచేసి, అనుకున్న మేర సాగునీరు వస్తే చెరువులను నింపుతామని స్పష్టంచేశారు. నాలుగో మోటారు బుధవారం నుంచి పనిచేస్తుందన్నారు. నాలుగు మోటార్లు పూర్తిస్థాయిలో పనిచేసిన తర్వాత నిర్దేశించిన ప్రకారం ఆయా డిస్ట్రిబ్యూటరీల ద్వారా నిరంతరం సాగు నీటిని ఎలాంటి అవరోధం లేకుండా ప్రణాళిక ప్రకారం విడుదల చేయాల ని సూచించారు. కాగా ఏఎమ్మార్పీ నుంచి సాగు నీటి విడుదలకు షెడ్యూల్ రూపొందించామన్నారు. నవంబరు 24వ తేదీ వరకు కాల్వల ద్వారా సాగునీటిని ఇచ్చేలా షెడ్యూల్ రూపొందించినట్లు ఇరిగేషన్ అధికారులు వివరించారు. సమావేశంలో ఈఈ నెహ్రూనాయక్, ప్రభుకళ్యాణ్, డీఈఈ ఆంజనేయస్వామి, పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు

(ఆంధ్రజ్యోతి, మర్రిగూడ): వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని 30పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. అంతకుముందు ప్రభుత్వ ఆస్పత్రిలోని కిడ్నీ వార్డును తనిఖీచేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌రే ప్లాంట్, మందుల వివరాలు అడిగి రికార్డులను పరిశీలించారు. వైద్యుల తీరుపై అసహనం వ్యక్తం చేసి, సమయ పాలన పాటించాలని, తీరు మార్చుకోవాలని సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను తనిఖీచేశారు. ఆమె వెంట డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌నాయక్, డాక్టర్ కోటినాయక్, డాక్టర్ దీపక్, డాక్టర్ శాలిని, పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేసీఆర్, హరీష్‌పై కాంగ్రెస్ కుట్రలు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

నల్లగొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏదో ఒక కారణంతో కేసీఆర్, హరీ్‌షరావును జైలుకు పంపాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీ్‌షరావు మంగళవారం హైదరాబాద్ నుంచి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వీక్షించారు. అనంతరం ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, రాష్ట్ర నేత కంచర్ల కృష్ణారెడ్డితో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరంపై హరీ్‌షరావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ స్పష్టంగా కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టిందన్నారు. కేసీఆర్, హరీ్‌షరావుపై కుట్రలు చేస్తూ జైలుకు పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కయి సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రకరకాల కమిషన్లు వేసినా ఏదీ తేల్చలేకపోయారని, కాళేశ్వరంపై మరో కమిషన్ వేశారని విమర్శించారు. అన్ని అనుమతులతో గోదావరిపై మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం చేశారన్నారు. తక్కువ ఖర్చుతో కాళేశ్వరం పూర్తిచేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇచ్చారన్నారు. సూర్యాపేట వరకు సాగునీరు పారించారని, కానీ రేవంత్‌రెడ్డి రెండేళ్లలో చేసిందేమీలేదన్నారు. గత ప్రభుత్వ పథకాలపై కమిషన్లు, విచారణల పేరుతో ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరంపై ఇచ్చిన కమిషన్ నివేదిక ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. వీటిని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో జరిగే స్థానికసంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి, నాయకులు అభిమన్యు శ్రీనివాస్, రాంమోహన్, బక్క పిచ్చయ్య, పాల్గొన్నారు.

నేర నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



కార్డన్‌సెర్చ్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నకిరేకల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. మంగళవారం నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డు, ఎస్సీ కాలనీలో డీఎస్పీ శివరాంరెడ్డి, 20 మంది ఎస్ఐలు, 300 మంది పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 300 ఇళ్లలో సోదాలు నిర్వహించగా, సరైన పత్రాలులేని 130 వాహనాలను పట్టుకున్నామన్నారు. అందులో 120 ద్విచక్రవాహనాలు, 10 ఆటోలు, ఎనిమిది మంది అనుమానితులను గుర్తించామన్నారు. ఒకరిని నేరస్థుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. నేపాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను విచారిస్తున్నామన్నారు. ఒక షెడ్డులో అక్రమంగా ఉంచిన 15 ఆవు దూడలను పట్టుకుని, వాటిని గోశాలకు తరలిస్తున్నామన్నారు. అదే విధంగా 18 మంది గంజాయి వినియోగిస్తున్న అనుమానితులను అదుపులోకి తీసుకుని పరీక్షలకు పంపించామన్నారు. ఎక్కడైనా అనుమానితులు కన్పిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కొత్తగా అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రాఘవరావు, ఆదిరెడ్డి, కొండల్‌రెడ్డి, కరుణాకర్, మహాలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న యూఎస్‌పీఎస్ నాయకులు

నల్లగొండ(కలెక్టరేట్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు గడిచినా ప్రభుత్వ విద్యారంగ పరిస్థితి మెరుగు పడకపోవడం శోచనీయమన్నారు. కొత్తప్రభుత్వం ఏర్పడి 19 నెలలైనా దీర్ఘకాలంగా పరిష్కారంకాని సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. ఉద్యోగుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని అన్నారు. కొత్త కొత్త పేర్లతో నూతన పాఠశాలను ప్రారంభించడం,ఎక్కువ మంది చదివే విద్యార్థులు ఉన్న పాఠశాలకు తక్కువ నిధులు ఖర్చు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో చేపట్టే మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలునిచ్చారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బక్క శ్రీనివాసచారి, కె.రత్నయ్య, బి.వెంకటేశం, జి.నాగమణి, పెరుమాళ్ల వెంకటేశం, పి.వెంకులు, ఖుర్షిద్‌మియా, నర్రా శేఖర్ రెడ్డి, వడిత్య రాజు, జి.అరుణ, యాట మధుసూదన్‌రెడ్డి, నలపరాజు వెంకన్న, మురలయ్య, పగిళ్ల సైదులు, కొమ్మరాజు సైదులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లాటరీ ద్వారా ఎంపిక చేసిన డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ఏవో మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 2017లో కలెక్టరేట్ వెనుక 552 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, సీపీఎం ఆధ్వర్యంలో పలుమార్లు చేపట్టిన ఆందోళనలతో 2023లో నిరుపేదల నుంచి దరఖాస్తులు తీసుకున్నారన్నారు. మొత్తం 10వేల దరఖాస్తులు రాగా, 3వేల మందిని అధికారులు అర్హులుగా గుర్తించారన్నారు. అనంతరం లాటరీ ద్వారా 552 మంది లబ్ధిదారులను గుర్తించి రెండేళ్లయినా వారికి ప్రొసీడింగ్స్ ఇవ్వలేదన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయాన్ని కోట్ల రూపాయలతో ఆరు నెలల్లో పూర్తిచేసిన చిత్తశుద్ధి పేదల ఇళ్ల నిర్మాణంపై లేకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలైనా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం విచారకరమన్నారు. ఈ నెల 15 నాటికి ప్రొసీడింగ్స్ ఇవ్వకుంటే 16న లబ్ధిదారులతో కలిసి ఆక్రమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండి.సలీం, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, కోట్ల అశోక్‌రెడ్డి, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, అవుట రవీందర్, గంజి రాజేష్, కీసర ప్రశాంతి, సిరాజుద్దీన్, పగిళ్ల జయమ్మ, వెంకటమ్మ, గౌసియా, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

డిండి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కొత్త అడ్వాన్స్ కోర్సులు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ తదితర కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 14 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చలో ఢిల్లీ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఓబీసీ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ మెరుగు శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిపారు. బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్సేనన్నారు. కార్యక్రమంలో చిరుమర్రి కృష్ణయ్య, విక్రమ్, బసవయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ జాతరకు వేళాయె

● ఈ నెల10 నుంచి మూడురోజులపాటు సంబురాలు ● 12 దశాబ్దాలుగా కొనసాగుతున్న జాతర



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు(ఫైల్)



దేవాలయంలో కొలువుదీరిన అమ్మవారు

చందంపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో అంకాలమ్మ జాతరకు వేళయింది. శతాబ్దాలనాటి సంస్కృతి, సంప్రదాయానికి అద్దం పట్టేలా జరిగే ఈ జాతర ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా ప్రారంభంకానుంది. దాదాపు 120 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జాతర ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో రాఖీ పౌర్ణమి రెండో లేదా మూడో రోజున ప్రారంభమై (ఈ నెల 10న ప్రారంభమై 11,12వ తేదీ వరకు) మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. పట్టణాల్లో స్థిరపడిన వారు ఇప్పటికే గ్రామాలకు చేరుకుంటుండడంతో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్థులే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. మొదటిరోజు గ్రామదేవత అంకాలమ్మకు ప్రత్యేకపూజలు, రెండోరోజు అమ్మవారి ఊరేగింపు, శోభాయాత్ర, మూడో రోజు బోనాలు, పోతురాజుల వేషాలు, భజనలు, బతుకమ్మలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేవరకొండ నుంచి చిత్రియాలకు మూడు రోజులపాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. 120 సంవత్సరాల నుంచి కొనసాగుతున్న అంకాలమ్మ జాతర గ్రామస్థుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

సంప్రదాయానికి ప్రతీక



మా వంశంలో నాలుగు తరాల నుంచి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అమ్మవారిని ఎత్తుకొని ఆడించడం మా వంశానికి దక్కిన అదృష్టంగా భావిస్తాం.

కాకునూరి ప్రసాద్, అంకాలమ్మ పూజారి

ఎక్కడున్నా గ్రామానికి చేరుకుంటాం



అంకాలమ్మ జాతర సందర్భంగా మేము ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉన్నా ప్రత్యేక సెలవులు పెట్టుకొని కుటుంబ సమేతంగా గ్రామానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తాం. వారం రోజులపాటు కుటుంబంతో కలిసి గ్రామంలో ఉంటాం.

కుంభం తారకేశవులు, గ్రామస్థుడు

ప్రమాదాలకు కేరాఫ్.. ఆలగడప

● జాతీయ రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం ● మలుపు వద్ద తరుచూ ప్రమాదాలు ● పలుమార్లు గ్రామస్థుల ఆందోళన



ఆలగడప గ్రామంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, యువకులు(ఫైల్)

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామం ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రహదారి విస్తరణ పనులను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి ఈ గ్రామం నుంచి వెళుతోంది. ఈ రహదారి పనులు చేపట్టకుండానే టోల్ వసూలు చేస్తూ.. జనం జేబుకు చిల్లుపెడుతున్నారు. కావాల్సిన చోట ప్రజల అవసరాలకు అనుగుణంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, ఇక్కడ మలుపు ప్రమాదకరంగా ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై కలెక్టర్, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

ఆలగడప గ్రామం నుంచి రాయినిపాలెం వెళ్లే దారిలో జాతీయ రహదారి పనులు గందరగోళంగా ఉన్నాయి. రోడ్డు దాటే సమయంలో వేగంగా వచ్చే వాహనాలతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. మూగ జీవులు, రైతులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. పశువులతోపాటు గ్రామస్థులు గాయాలపాలై మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఈ నెల 4వ తేదీన ఆలగడప గ్రామం నుంచి మిర్యాలగూడ వచ్చేందుకు హౌసింగ్‌బోర్డులోని ఓ స్కూల్ బస్సు రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన లారీ వెనుక వైపు నడస్‌గా తగలడంతో బస్సులో ప్రయాణిస్తున్న 50 మంది విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. రహదారి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ యువకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. గంటకు పైగా రహదారిపై ధర్నా చేయడంతో మిర్యాలగూడ-కోదాడ రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య అక్కడికి చేరుకొని నేషనల్ హైవే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా ఆలగడప గ్రామానికి చెందిన చింతపల్లి సైదులు రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి జహంగీర్ బైక్‌పై వెళ్తుండగా స్పీడ్‌గా వస్తున్న ఆటో ఢీకొనడంతో గాయాలపాలయ్యారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సేవే పరమావధిగా పనిచేయాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సేవే పరమావధిగా పనిచేస్తేనే ప్రజల మెప్పు పొందొచ్చని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 35వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరంనర పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో 18 నెలలు.. 18 పథకాలు.. 18 రోజులు.. అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు చేయబోయే అంశాలను వివరించేలా కరపత్రాలను ముద్రించినట్లు తెలిపారు. వార్డు ఇన్‌చార్జీలు, మాజీ కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, కాశయ్య, శ్రీనివాస్, అరవింద్, రఘు, శివమణి, శ్రవణ్, రాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి



ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎం రామ్మోహన్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పనిచేయాలని ఆర్టీసీ డీఎం రామ్మోహన్‌రెడ్డి ఉద్యోగులకు సూచించారు. డిపో పరిధిలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు నాణ్యమైన సేవలందిస్తూనే సంస్థ ప్రయోజనాలను కాపాడాలని పిలుపునిచ్చారు. కష్టపడే తత్వం ఉన్న ఉద్యోగులకు యాజమాన్య గుర్తింపు తప్పకుండా ఉంటుందన్నారు. డిపో డ్రైవర్లు, కండక్టర్లు రీజియన్ పరిధిలో గుర్తింపు పొందడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భారతీబాయి, అధికారులు యాదగిరి, నాగమణి, వైష్ణవి, సత్యం, జానకిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ



షూ పంపిణీ చేస్తున్న దిలీప్‌రెడ్డి

హాలియా, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులందరికీ బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సహకారంతో మంగళవారం కొంపల్లి మాజీ సర్పంచ్ దిలీప్‌రెడ్డి షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా, సర్కారు బడులను బలోపేతం చేయాలనే గొప్ప ఆశయంతో ఫౌండేషన్ ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం దాస వెంకన్న, సీనియర్ ఉపాధ్యాయులు సైదులు, ప్రశాంత్, ఎంపీపీఎస్ కొత్తపల్లి ఉపాధ్యాయులు దివ్యలక్ష్మి, సరిత, జి.సత్యానారాయణరెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

వేణు మృతి పార్టీకి తీరని లోటు

వేములపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్కునూరు గ్రామానికి చెందిన సీపీఎం గ్రామ కార్యదర్శి నలబోతు వేణు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం వేణు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, నాయకులు రెమడాల పరుశురాములు, మద్దిరాల సత్యానారాయణరెడ్డి, రెమడాల భిక్షం, కందుల పెదనాగిరెడ్డి, వడ్డెగాని సైదులు, జెర్రిపోతుల భిక్షం పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ ● అడవిదేవులపల్లి, దామరచర్లలో కొనసాగిన సైకిల్‌యాత్ర



అడవిదేవులపల్లిలో మాట్లాడుతున్న ఖమ్మంపాటి శంకర్

అడవిదేవులపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మార్పు చూపిస్తామని ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చేపట్టిన సంఘర్షణ సైకిల్‌యాత్ర మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్‌తో కలిసి మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు లేదని, మధ్యాహ్న భోజనం రుచికరంగా లేకపోవడంతో అర్ధాకలితో క్లాస్‌రూమ్‌లో పాఠాలు వింటున్నారన్నారు. కేజీబీవీ పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మించాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, స్పందన, కోరె రమేష్, రవీందర్, వెంకటేష్, కిరణ్, జగదీష్, జగన్, వీరన్న పాల్గొన్నారు.

గురుకుల భవనాన్ని పూర్తి చేయాలి

దామరచర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర మండలకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలన్నారు. బాలికల గురుకుల కళాశాలలో తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదన్నారు. కార్యక్రమంలో ధీరావత్ వీరన్ననాయక్, కుర్ర సైదనాయక్, కావ్య, స్పందన, రమేష్, రవీందర్, కిరణ్, ప్రసన్న, అనిల్, రాకేష్, వినోద్, రమేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు ఉచిత విద్యుత్

● వసంత్‌కుమార్, విద్యుత్ ఏఈ, చందంపేట



ఇంటర్వ్యూ Interview

మండలంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చందంపేట ట్రాన్స్‌కో ఏఈ వసంత్‌కుమార్ తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటున్నామంటున్న ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి-చందంపేట)

ఆంధ్రజ్యోతి: వ్యవసాయ మోటార్లకు ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారు?

ఏఈ: రాత్రి 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: చందంపేట మండలంలో ఎన్ని వ్యవసాయ మోటర్లు ఉన్నాయి?

ఏఈ: 3వేల వరకు మోటార్లు ఉన్నాయి. వాటికి ఉచిత విద్యుత్ అందిస్తుంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు పంపించారు?

ఏఈ: ప్రస్తుతం మండలంలో నాలుగు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అదనంగా మరో రెండింటికి ప్రతిపాదనలు పంపించాం. పొగిళ్ల, పోలేపల్లి గ్రామాలకు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో విద్యుత్ సమస్యలను ఏవిధంగా పరిష్కరిస్తున్నారు?

ఏఈ: వ్యవసాయ మోటార్లకు ఎలాంటి లోవోల్టేజీ సమస్యలేదు. ఎక్కడైనా ఉంటే సిబ్బంది అందుబాటులో ఉండి, సమస్యను పరిష్కరిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఉచిత విద్యుత్‌కు దరఖాస్తులు చేసుకునేందుకు విధానం ఎలా?

ఏఈ: రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లుతో ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదిస్తే.. అనుమతి వస్తుంది.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేత నక్క వెంకటేశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మల్లేష్‌యాదవ్, శ్రీను, యలిజాల శ్రీను, మల్లేష్, రమేష్, చంద్ర, రమేష్‌నాయక్, సయ్యద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీవో అరుంధతి

మాడ్గులపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని జీసీడీవో అరుంధతి అన్నారు. మంగళవారం మండలంలోని మాడ్గులపల్లి కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు సమాజంపై అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆగస్టు నెలలోనే కొత్త భవనాన్ని ప్రారంభించేలా కృషి చేస్తానని సూచించారు. ఆమె వెంట ఎస్‌వో సునీత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఆర్డీవో

నేరేడుగొమ్ము, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి కోరారు. మంగళవారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు భోజనం సక్రమంగా అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. త్వరలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. 'భూభారతి'లో వచ్చిన దరఖాస్తులు, పరిష్కారమైన భూముల వివరాలను తహసీల్దార్ ఉమాదేవిని అడిగి తెలుసుకున్నారు.



నేరేడుగొమ్ము కస్తూర్బాగాంధీ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

చిన్నారులకు అమ్మపాలు అమృతంతో సమానం



చింతపల్లి మండలం వేంకటేశ్వరనగర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సక్కుబాయి

● ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి

చింతపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అమ్మపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని వేంకటేశ్వరనగర్ ఆర్టీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బాదేపల్లి ప్రభావతి, స్వప్న పాల్గొన్నారు.

వేములపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లి అందించే ముర్రుపాలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమి రజిని అన్నారు. మంగళవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఇటిక్యాల రెండో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లి అందించే పాలలోనే బిడ్డకు అన్నిరకాల విటమిన్లు, పోషక విలువలు అందుతాయని, ప్రతీ బాలింత గమనించి, గుర్తించి విధిగా పాలను అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుభద్ర, యాదమ్మ, ఆయా జలేంద్ర, గర్భిణులు పాల్గొన్నారు.

నేరేడుగొమ్ము, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్‌లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శోభ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. తల్లిపాలలో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక ఆహారం అందజేస్తున్నామన్నారు. తల్లిపాల ప్రాముఖ్యంపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, భాగ్యమ్మ, సువార్త, సరిత, లక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

డీఏ, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

కొండమల్లేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం మండలంలో చేపట్టిన తపస్ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండేళ్లుగా రావాల్సిన డీఏ, పీఆర్సీలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని, ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమిరె సైదులు, బద్దెల అంజయ్య, బొమ్ము రవి, శ్రీనివాస్, నవీన్, నర్సింహ, జ్యోతి, వరలక్ష్మి, మానస తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలి

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మిల్లర్లు సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ డీటీ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం పీఏపల్లి మండలకేంద్రంలోని గణేష్ రైస్ మిల్లును తనిఖీ చేసి మాట్లాడారు. కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా లెవీ పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. మిల్లులో ఉన్న ధాన్యం పరిమాణాన్ని పరిశీలించారు. ఎంత ధాన్యం మిల్లుకు చేరింది, తదితర అంశాలను మిల్లర్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

వానాకాలంలోనూ విద్యుత్‌కు డిమాండ్

(5వపేజీ తరువాయి)

పెరిగినట్టు చెబుతున్నారు.

భారీగా పెరిగిన వ్యవసాయ విద్యుత్ వినియోగం

గత ఏడాది ఇదే సీజన్‌తో పోల్చితే ఈ ఏడాది వానాకాలంలో వ్యవసాయ విద్యుత్ వినియోగం సుమారు 13 నుంచి 15లక్షల యూనిట్ల (సుమారు 1.5మి.యూ) వరకు పెరిగినట్టు విద్యుత్ అధికారులు అంచనావేస్తున్నారు. నాన్ ఆయకట్టు ప్రాంతాలతోపాటు నాగార్జునసాగర్ ఆయకట్టులోనూ ప్రస్తుత సీజన్‌లో బోరుబావుల కింద ఇప్పటికే నారుమళ్లు, ఇతర ఆరుతడి పంటల సాగు భారీగా పెరిగింది. దీంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగింది. వీటితోపాటుగా గత ఏడాది కంటే అధికారికంగా వ్యవసాయ కనెక్షన్లు మూడువేలకు పైగా పెరిగాయి. దీంతో విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు, ఏఎమ్మార్పీ మూసీ కాల్వల ద్వారా ఆయకట్టుకు నీరిస్తున్నందున్న ఆగస్టు నుంచి బోరుబావుల వినియోగం తగ్గుతుందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : జూనియర్/ వెంకటేశ్వర: హరిహర వీరమల్లు / రాఘవ: హరిహర వీరమల్లు / విట్రోస్: హరిహర వీరమల్లు (3 స్క్రీన్లలో) దేవరకొండ : మనోజ్ : మైబేబీ మైత్రి వెంకటేశ్వర : హరిహర వీరమల్లు